సర్‌చార్జిలో తేడాలు



- రూ.60 కోట్లకు రూ.37 కోట్లే జమ
- పొంతన లేకుండా రిజిస్ట్రేషన్, జడ్పీ లెక్కలు
- సమాచార లోపంతోనే తేడాలంటోన్న రిజిస్ట్రార్

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌కు స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ నుంచి రావాల్సిన సర్‌చార్జి చెల్లిం పుల్లో భారీ తేడాలు కనిపిస్తున్నాయి. చెల్లింపు లకు సంబంధించి రిజిస్ట్రేషన్, జడ్పీ అధికారుల లెక్కలకు పొంతన ఉండటం లేదు. 2022-2023 నుంచి 2024-2025 వరకు రూ.60 కోట్ల వరకు సర్‌చార్జి రూపేణా జడ్పీకి గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని రిజిస్ట్రేషన్ల శాఖ చెల్లిం చాలి. గత ప్రభుత్వ హయాంలో జడ్పీ అధికారు లు పలుమార్లు రిజిస్ట్రేషన్ శాఖకు లేఖలు రాసి నా పెద్దగా స్పందన లేదు. చాలాకాలంగా పెం డింగ్‌లో ఉన్న సర్‌చార్జి చెల్లింపులపై చర్చించేం దుకు గురువారం జడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా, సీఈవో జ్యోతిబసు మూడు జిల్లాల రిజిస్ట్రార్లతో సమావేశమయ్యారు. ఈ క్రమంలో అధికారుల మధ్య లెక్కల్లో వ్యత్యాసాలను గుర్తిం చారు. సర్‌చార్జి రూపేణా గడచిన నాలుగేళ్లలో జడ్పీకి రూ.60 కోట్లు వరకు రావాల్సి ఉంది. అయితే రూ.37 కోట్లు మాత్రమే జమ అయినట్లు జడ్పీ అధికారులు చెప్తున్నారు. మిగిలిన రూ.23 కోట్లు ఎప్పుడు చెల్లిస్తారన్న అన్న దానిపై రిజిస్ట్రేషన్ అధికారులు స్పష్టత ఇవ్వలేదని జడ్పీ వర్గాలు చెబుతున్నాయి. చెల్లింపుల విషయంలో వ్యత్యాసం కనపడుతున్నందున మరో వారంలో పూర్తి సమాచారంతో వస్తామని రిజిస్ట్రార్లు జడ్పీ అధికారులకు చెప్పినట్లు తెలుస్తుంది.

ఏమయ్యాయి.. ఎటుపోయాయి..

గుంటూరు జిల్లా నుంచి 2022-2023, 2024- 2025 జూన్ వరకు సర్‌చార్జి రూ.23 కోట్ల వరకు రావాల్సి ఉంది. అయితే మొత్తం చెల్లించేశామని రిజిస్ట్రేషన్ అధికారులు చెప్తుండగా రూ.17.28 కోట్లు మాత్రమే జమైనట్లు జడ్పీ అధికారులు తే ల్చారు. అయితే మిగిలిన రూ.5.72 కోట్లు ఏమ య్యాయి.. ఎటుపోయాయో అంతుపట్టడంలేదు. పల్నాడు జిల్లా నుంచి రూ.25 కోట్లకు రూ.13.9 కోట్లు మాత్రమే జమ అయినట్లు చెబుతున్నారు. రూ.15.11 కోట్లు జమ అయినట్లు పల్నాడు జిల్లా రిజిస్ట్రార్ చెబుతున్నారు. లెక్కల్లో ఇంత పెద్ద మొత్తంలో తేడాలు గమనించిన అధికారులు సర్ చార్జి సొమ్ము ఎక్కడకి పోయిందో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు.

బాపట్లలో ఇచ్చింది ఎక్కువ..

గుంటూరు, పల్నాడు జిల్లా అధికారులు తక్కువ ఇచ్చి ఎక్కువ ఇచ్చినట్లు చెబుతుంటే బాపట్ల జిల్లాలో మాత్రం ఎక్కువ ఇచ్చి తక్కువ ఇచ్చినట్లు చెబుతున్నారు. బాపట్ల నుంచి జిల్లా పరిషత్‌కు రూ.12 కోట్లు రావాల్సి ఉండగా, రూ.7.74 కోట్లు జమ చేశారు. కానీ బాపట్ల రిజిస్ట్రార్ రూ.5.86 కోట్లు మాత్రమే ఇచ్చినట్లు చెబుతున్నారు. జడ్పీకి సర్‌చార్జి చెల్లింపుల్లో నెలకొన్న గందరగోళం అంతా సమాచార లోపం వల్లేనని గుంటూరు రిజిస్ట్రార్ శైలజ తెలిపారు.

నల్లమడకు..నిధులు

ఆధునికీకరణకు రూ.180.60 కోట్లు

- నిధుల మంజూరుకు క్యాబినెట్ ఆమోదం
- మూడు జిల్లాల్లో 1.80 లక్షల ఎకరాల ఆయకట్టుకు మేలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

నల్లమడవాగు ఆధునికీకరణకు పట్టిన గ్రహణం ఎట్టకేలకు వీడింది. తొలిదశ పనుల్లో భాగంగా రూ.180.60 కోట్లు విడుదలకు తాజాగా జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఆమోదముద్ర పడింది. దీంతో ఏళ్లగా రైతులు ఎదురు చూస్తున్న నల్లమడ ఆధునికీకరణ పనులకు మోక్షం లభించినట్లైంది. 2017లోనే అప్పటి టీడీపీ ప్రభుత్వం నల్లమడవాగు ఆధునికీకరణ పనులపై దృష్టి పెట్టింది. రూ.180 కోట్లు నిధుల విడుదలతో అప్పట్లో భూసేకరణపై అధికారులు డీపీఆర్ రూపొందించారు. ఇక పనులు పట్టాలెక్కడమే తరువాయి అనుకునే దశలో ప్రభుత్వం మారి వైసీపీ గద్దెనెక్కింది. దీంతో పనులకు గ్రహణం పట్టింది. అప్పటి నుంచి రైతులు నల్లమడ వాగు ఆధునికీకరణపై ఆందోళన చేస్తున్నారు. కానీ గత ప్రభుత్వం ఐదేళ్ల దీని గురించి పట్టించుకోలేదు. ఈ పరిస్థితుల్లో కూటమి గద్దెనెక్కగానే పనులపై కదలిక వచ్చింది. జనవరి



ణపై కసరత్తు చేశారు. భూసేకరణపై నీటిపారుదలశాఖ అధికారులు రెండు నెలల క్రితం సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు. ఈ క్రమంలో తాజాగా దం తెలపడంతో పనులపై అధికారులు దృష్టి సారించారు. గత ప్రభుత్వం వహించిన నిర్లక్ష్యం కారణంగా వ్యయం దాదాపు రూ.325 కోట్లకు చేరిందని అధికారులు చెబుతున్నారు. ఇప్పుడు ప్రభుత్వం విడుదల చేసే రూ.180.60 కోట్లు భూసేకరణకే సరిపోతాయని, పనులకు అదనంగా మరో రూ.145 కోట్లు ఖర్చు తప్పదనేది ఇరిగేషన్ అధికారుల అభిప్రాయంగా ఉంది. నల్లమడ ఆధునికీకరణతో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని దాదాపు 1.80 లక్షల ఎకరాల ఆయకట్టు కు మేలు జరగనున్నది. దాదాపు 173 కి.మీటర్ల మేర ప్రవహించి బాపట్ల మండలం సూర్యలంక సమీపంలోని పొగరు వద్ద సముద్రంలో కలుస్తోంది. ఈ వాగు ప్రస్తుతం గరిష్ఠంగా 23 వేల క్యూసెక్కుల వరకు ప్రవాహ సామర్థ్యాన్ని తట్టుకుంటోంది. అదే ఆధునికీకరణ పనులు పూర్తయితే సామర్థ్యం దాదాపు 45 వేల క్యూసెక్కుల వరకు పెరగనుందని అధికారులు లెక్కలు వేస్తున్నారు.

భూసేకరణే కీలకం..

నల్లమడ వాగు ఆధునికీకరణలో భూసేకరణే కీలకం. ప్రస్తుతం విడుదల చేసే నిధుల్లో 70 శాతం దీనికే ఖర్చయ్యే అవకాశం ఉంది. గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని నాలుగు మండలాల పరిధిలో భూ సేకరణ చేపట్టాలని ఇప్పటికే ప్రభుత్వానికి నివేదికలు అందాయి. బాపట్ల జిల్లాలో బాపట్ల, కర్లపాలెం మండలాలు, గుంటూరు జిల్లాలో పెదనందిపాడు, కాకుమాను మండలాల పరిధిలో పనులు సాగనున్నాయి. ఈ క్రమంలో నష్టపరిహారం మదింపులో రెవెన్యూ యంత్రాంగం అంచనాలు రూపొందిస్తోంది. వరద పోటెత్తిన సమయాల్లో మూడు జిల్లాల పరిధిలోని రైతుల్ని నల్లమడ వాగు వణికిస్తూనే ఉంది. కరకట్టలు బలహీనంగా ఉండడం, వాగులు పొంగి గండ్లు పడి పంటచేలను ముంచెత్తిన సమయాల్లో ఆధునికీకరణ డిమాండ్ తెరమీదకు వస్తూనే ఉంది. ఈ పరిస్థితుల్లో ఎట్టకేలకు రైతుల కడగండ్లు తీర్చడానికి ప్రభుత్వం నిధులు మంజూరుతో తొలి అడుగు పడింది. ప్రభుత్వం నిధుల విడుదలతో నల్లమడ వాగు ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నీటిని మోటార్ల ద్వారా బయటకు పంపుతున్న చేపల పెంపకం దారులు

చేపల కోసం చెరువు ఖాళీ

- వర్షాలు లేక బెట్టకు వచ్చిన వాతావరణం
- సాగునీటిని వృథాగా వదలడంపై రైతుల ఆందోళన

బల్లికురవ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): వర్షాభావ పరిస్థితుల్లో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలి. అయితే చేపల కోసంగా చెరువులో ఉన్న నీటిని బయటకు వదలడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చేపలు పట్టుకునేందుకు చెరువులో ఉన్న నీటిని వృథా చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు మండిపడుతున్నారు. చేపల పెంపకం లీజు సమయంలో నీటిని వదలకుండా చేపలు పట్టుకోవాలన్న నిబంధన ఉన్నా దానిని పట్టించుకోవడం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. బల్లికురవ మండలం అంబడిపూడి సాగునీటి చెరువు కింద అంబడిపూడి, గుంటుపల్లి, కొత్తపాలెం, నక్కబొక్కల పాడు గ్రామాల్లోని పంట భూములు ఆధారపడి ఉన్నాయి. ఈ చెరువులో చేపల పెంపకానికి గత ఏడాది ఓ కాంట్రాక్టర్ లీజ్‌కు తీసుకున్నారు. ప్రస్తుతం చెరువులోని చేపలు పట్టుకు నేందుకు సంబంధిత లీజుదారుడు సిద్ధమయ్యాడు. దీంతో చెరువులో ఉన్న నీటిని నాలుగు రోజుల నుంచి వాగులకు వదులుతు న్నాడు. ఒక వైపు వాతావరణం బెట్ట పెట్టి వర్షాలు లేక పంటలు ఎండు ముఖం పడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో చెరువులో ఉన్న నీటిని వది లేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెరువును ప్రస్తుతం ఖాళీ చేస్తున్నారని, మళ్లీ చెరువును నింపుకోవాలంటే ఎంత సమయం పడుతుందని రైతులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు మాత్రం చెరువు వైపు కన్నెత్తి చూడ లేదని రైతులు తెలిపారు. చెరువులో నీరు ఉంటే గ్రామాలలో గ్రౌండ్ వాటర్ కూడా బాగుంటుందని అలాంటిది చుక్క నీరు లేకుండా మోటార్లు ఏర్పా టు చేసి చెరువును ఖాళీ చేస్తున్నారని రైతులు అంటున్నారు.

రూ.10.22 కోట్లతో 37 గ్రామాలకు తాగునీరు

నీటి సరఫరాకు ప్రతీ ఇంటికి కుళాయి కనెక్షన్: ఎమ్మెల్యే వేగేశన

బాపట్ల, జూలై 11 (ఆంధ్రజ్యోతి): బాపట్ల మండలంలోని 19 గ్రామపంచాయతీల పరిధిలో 37 గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేసేందుకు జలజీవన్‌మిషన్ ద్వారా రూ.10.22 కోట్లు వెచ్చించి పైపులైన్లు ఏర్పాటు చేసి 6,318 గృహాలకు కుళాయి కనెక్షన్లు ఇచ్చి తాగునీటిని అందిస్తామన్నారు.మరుప్రోలువారిపాలెం పథకం ద్వారా ఇప్పటి వరకు 25 గ్రామాల్లో నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఇ



శిలఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

చ్చించి పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. ధరివాదకొత్తపాలెం వెస్ట్‌శ్యాంప్ డ్రెయిన్ పక్కనే మరుప్రోలువారిపాలెం సామూహిక రక్షిత మంచి నీటి పథకం ఎస్ఎస్ ట్యాంక్ వద్ద శుక్రవారం జల్‌జీవన్ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి శిలఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంటింటికి కుళాయి కనెక్షన్ ద్వారా తాగునీటిని సరఫరా చేసేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. 57 కిలోమీటర్ల పొడవున పైకప్పై తీరప్రాంత గ్రామాలకు తాగునీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ ఎం.అనంతరాజు, ఏఈ షేక్.మంజూరుబాషా, మార్కెట్‌యార్డు కమిటీ ఛైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి, పట్టణ, మండలపార్టీ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, ముక్కామల సాంబశివరావు, సీనియర్ నాయకులు ఆంధ్రేయ, జి.గిరిజారాణి, మహిళా అధ్యక్షురాలు కాగిత నాగభూషణమ్మ, పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లంసరోజని, కార్యదర్శి ఝాన్సీరాణి పాల్గొన్నారు.

జేసీ నియామకంలో జాప్యం

- ప్రఖర్‌జైన్ రెండు నెలల క్రితం బదిలీ
- భూ సంబంధిత అంశాలపై కదలని ఫైళ్లు
- ఇన్‌చార్జి జేసీ బాధ్యతల్లో కలెక్టరు వెంకటమురళి
- జిల్లా ఆవిర్భావం నుంచి వేధిస్తోన్న సిబ్బంది కొరత

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

పరిపాలనలో కీలకమైన జాయింట్ కలెక్టర్ పోస్టు జిల్లాలో రెండు నెలలపైగా ఖాళీగా ఉంది. ఇన్‌చార్జి జేసీగా కలెక్టరే వ్యవహరిస్తున్నారు. జిల్లా ఆవిర్భావం నుంచి ఆయా విభాగాల్లో సిబ్బంది కొరత వేధిస్తూనే ఉంది. కీలక శాఖలకు అధిపతులు సైతం ఎఫ్ఏసీగా విధులు నిర్వహించక తప్పని పరిస్థితి మూడేళ్లుగా జిల్లాలో ఉంది. ఈ నేపథ్యంలో అత్యంత కీలకమైన జేసీ పోస్టు కూడా రెండు నెలల నుంచి భర్తీకి నోచుకోలేదు. ఇది పరిపాలనపై ప్రభావం చూపడంతోపాటు కీలకమైన విభాగాల్లో ఫైళ్లు కొండలా పేరుకుపోతున్నాయి. జేసీగా పనిచేస్తున్న ప్రఖర్‌జైన్‌ను ఆర్టీజీఎస్ సీఈవోగా ప్రభుత్వం బదిలీ చేసి రెండు నెలలు దాటింది. అప్పటి నుంచి జేసీ పోస్టు భర్తీపై ప్రభుత్వం వైపు నుంచి ఎలాంటి కదలిక లేదు. ఓ వైపు ప్రభుత్వం రెవెన్యూ వివాదాలను త్వరితగతిన పరిష్కరించాలనే లక్ష్యంతో అడుగులేస్తోంది. రీ సర్వే అంశంతో పాటు నల్లబర్లీ పొగాకు కొనుగోళ్లకు మార్క్‌ఫెడ్‌నే ప్రభుత్వం రంగంలోకి దింపింది. ఇలాంటి తరుణంలో జేసీ పోస్టు భర్తీపై ప్రభుత్వం దృష్టిపెట్టకపోవడంతో కొన్ని ఫైళ్ల పరిష్కారంలో జాప్యం జరుగుతోంది. ప్రభుత్వం నిర్దేశించిన విజన్ ప్రణాళికలపై కూడా ఆ ప్రభావం పడుతోంది. రెవెన్యూతో లింక్ అయి ఉన్న ఈ-క్రాప్ చిక్కులతో బర్లీ పొగాకు కొనుగోళ్లలో వారం రోజులు అయోమయం నెలకొంది. అదే జేసీ పోస్టు నియామకం చేపట్టి ఉంటే మార్క్‌ఫెడ్ విభాగం మొత్తాన్ని మానిటర్ చేయడంతో పాటు రెవెన్యూ చిక్కులకు ఇంకా త్వరగా పరిష్కారం లభించేదనే అభిప్రాయం ఉంది. పని ఒత్తిడి మొత్తం కలెక్టర్ వెంకటమురళిపైనే పడడంతో అన్నింటిని సమన్వయం చేసుకోవడం ఆయనకు తలకుమించిన భారంగా మారింది. ప్రభుత్వ ప్రాథమ్యాలు రోజురోజుకూ పెరిగిపో తుండడంతో జేసీ నియామకం అత్యవసరంగా తయారైంది. అక్రమలే అవుట్లపై చర్యల విషయంలో కదలిక వచ్చిన నేపథ్యంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (బావుడా) వైస్ ఛైర్మన్ పదవి ఖాళీగా ఉండడం కూడా బావుడా కార్యకలాపాలపై ప్రభావం చూపుతోంది. రెన్యువబుల్ ఎనర్జీ మ్యానుఫ్యాక్చరింగ్ జోన్(ఆర్ఈఎంజెడ్) అద్దంకి నియోజకవర్గంలో ఏర్పాటు కానుంది. ఇందుకు సంబంధించి భూ సేకరణ అంకం త్వరలోనే మొదలుకానుంది. మైనింగ్ లీజులపై నూతన విధానానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. సూర్యలంక అభివృద్ధి పనులకు టెండర్లు, త్వరలోనే నల్లమడ వాగు ఆధునికీకరణ కోసం భూ సేకరణ ఘట్టం కూడా తెరమీదకు రానుంది. ఇన్ని కీలక అంశాలపై కసరత్తు జరుగుతున్న సమయంలో జేసీ పోస్టు భర్తీపై ప్రభుత్వం దృష్టిపెట్టాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.



పర్చూరులో..రూ.2 కోట్లకుపైగా టోకరా

- తక్కువ ధరకు శిల్క్‌శారీస్ పేరుతో రంగప్రవేశం
- అధిక వడ్డీ ఆశ చూపి నిలువునా ముంచిన ఘనుడు

పర్చూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): తక్కువ ధరకు నాణ్యమైన శిల్క్‌చీరలను అందిస్తానని రంగప్రవేశం చేసి ప్రజల్లో నమ్మకం కల్గిన తర్వాత అధిక వడ్డీ ఆశ చూపి రూ.2 కోట్లకు పైగా మోసగించిన ఘరానా మోసగాడి ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. జిల్లాకు చెందిన వ్యక్తిగా చెప్పుకొంటూ ఏడాది క్రితం ఓ వ్యక్తి పర్చూరులో ఇల్లు అద్దెకు తీసుకుని నాణ్యమైన శిల్క్ చీరలను తక్కువ ధరకు ఇస్తున్నానంటూ ప్రచారం చేసుకున్నాడు. క్రమక్రమంగా ఇంకొల్లు, చెరుకూరు, పర్చూరు, దగ్గుబాడు తదితర ప్రాంతాలకు వ్యాపారం విస్తరించాడు. అనంతరం చీరల వ్యాపారంతో పాటు వడ్డీ వ్యాపారానికి తెరలేపాడు. రూ.10 వేలు ఇస్తే నెలకు రూ.12 వేల ఇస్తానని ఆశ చూపాడు. దాదాపు ఏడాది పాటు తీసుకున్న వారందరికీ వడ్డీ సహా సక్రమంగా చెల్లింపులు చేశాడు. దీంతో నిరుపేదల నుంచి ధనవంతుల వరకు వడ్డీలకు ఆశపెడి పెద్దమొత్తంలో పెట్టుబడులు పెట్టారు. కొందరైతే బంగారు వస్తువులను సైతం తాకట్టు పెట్టి సదరు మోసగాడికి నగదు అప్పజెప్పారు. ఇలా రూ.2కోట్లకు పైగా సేకరించిన వ్యాపారి రెండు నెలల నుంచి ముఖం చాటేశాడు. ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు. శిల్క్ చీరల వ్యాపారితో సన్నిహితంగా మెలిగిన వ్యక్తుల ద్వారా మోసగాడి జాడ కోసం ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో ఏమి చేయాలో అర్థం కాక బాధితులు కన్నీటి పర్యంతం అవుతున్నారు. మోసగాడిది గోదావరి జిల్లాలోని ఓ గ్రామంగా చెబుతున్నారు. అయితే బాపట్ల జిల్లా వాసిగా ఆధార్ కార్డు సృష్టించుకుని ఇక్కడ వ్యాపారం చేసినట్లు బాధితులు తెలిపారు. నకిలీ బంగారం బ్యాంకులో తనఖా పెట్టి రుణం తీసుకున్న ఘటనలో కూడా ఇతడి పాత్ర ఉందని విశ్వసనీయ సమాచారం. ఇటీవల కొందరు ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకు పోయినట్లు తెలిసింది.





చీరాల.. పీఠం ఎవరిదో

- 16న మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక
- భారీగా ఆశావహులు.. ఏకాభిప్రాయంపై ఎమ్మెల్యే కసరత్తు

(బాపట్ల, చీరాల - ఆంధ్రజ్యోతి)

అవిశ్వాసం నోటీసు మొదలు ఓటింగ్ జరిగి ఛైర్మన్ పదవి నుంచి జంజనం శ్రీనివాసరావును గద్దె దింపే వరకు గతంలో అనేక మలుపులు తిరిగిన చీరాల మున్సిపాలిటీ అంశం ఎట్టకేలకు తుది అంకానికి చేరింది. అనేక మలుపుల మధ్య మే 14న ఛైర్మన్ పదవితో పాటు రెండు వైస్ ఛైర్మన్‌ల స్థానాలు ఖాళీ అయ్యాయి. ఈ నెల 16న ఛైర్మన్ ఎన్నికకు ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రాజకీయ సమీకరణాలు మళ్లీ తెరపైకి వచ్చాయి. ఆశావాహులు భారీగా ఉన్నా ఏకాభిప్రాయంతోనే ఛైర్మన్ అభ్యర్థి పేరును ప్రకటించాలనేది ఎమ్మెల్యే కొండయ్య ఆలోచనగా ఉంది. ఇందుకు సంబంధించి ఆయన శుక్రవారం పలువురు కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించి, తన ప్రతిపాదనను వారి ముందుంచినట్లు సమాచారం.

కొనసాగుతున్న ఉత్కంఠ

ఛైర్మన్‌పై అవిశ్వాసం అనేక మలుపులు తీసుకోగా ప్రస్తుతం ఛైర్మన్ ఎంపిక ఏ రీతిన జరగనుందో అనే ఉత్కంఠ అటు రాజకీయ వర్గాల్లో ఇటు ప్రజల్లో నెలకొంది. జంజనంపై అవిశ్వాసం మొదలుకుని భారీగా ఖర్చు చేసిన తనకే ఛైర్మన్ పీఠం కట్టబెట్టాలనేది ఓ కౌన్సిలర్ వాదన. ఎన్నికలకు ముందే టీడీపీలోకి వచ్చి విధేయతతో పనిచేశామని, ఇప్పుడు పదవి ఆశిస్తున్న సదరు కౌన్సిలర్ అధికారం వచ్చాక టీడీపీలోకి వచ్చిన అంశాన్ని మరో కౌన్సిలర్ గుర్తు చేస్తున్నారు. దీంతో ఛైర్మన్ ఎంపిక అంశం రసకందాయంలో పడింది.

రాజకీయ సమీకరణాలు ఇలా..

గతంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ 21, స్వతంత్రులు 11, టీడీపీ 1 వార్డు గెలుచుకున్నాయి. స్వతంత్రులుగా గెలిచిన 11 మంది లో ఆరుగురు వైసీపీ అధికారంలో ఉన్నప్పుడే ఆ గూటికి చేరారు. దీంతో వైసీపీ బలం 27కు చేరగా, ఐదుగురు మాజీ ఎమ్మెల్యే ఆమంచి వర్గంగా, ఒకరు టీడీపీ వైపు ఉన్నారు. అయితే సార్వత్రిక ఎన్నికలకు ఆరు నెలల ముందు, ఫలితాలు వచ్చాక వైసీపీ కౌన్సిలర్లు పోటీపడి టీడీపీ బాట పట్టారు. దీంతో టీడీపీ బలం 21కు చేరింది. ప్రస్తుతం వైసీపీలో ఏడుగురు ఉన్నారు. ఐదుగురు ఆమంచి వర్గంగా కొనసాగుతున్నారు.

పటిష్ఠత.. పైపైనే

- నాసిరకంగా కాల్వ కట్టల మరమ్మతులు
- మెయిన్ కెనాల్‌కు నీరు విడుదలతో కుంగిన బాదులు
- రూ.3.50 కోట్లతో చేపట్టిన పనులపై రైతులు అనుమానం



అరవపల్లి సమీపంలో మెయిన్ కెనాల్ పటిష్ఠత కోసం వేసిన ఇసుక బస్తాలు జారిపోయిన దృశ్యం

రేపల్లె, జూలై 11 (ఆంధ్రజ్యోతి): తీరప్రాంతంలో మెయిన్ కెనాల్ మరమ్మతులకు ప్రభుత్వం రూ.3.50 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో మెయిన్ కెనాల్, సైడ్ చానల్స్ డ్రెయిన్లలో పూడికతీశారు. కోతకు గురైన అరవపల్లి మెయిన్ కెనాల్ కాల్వ కట్ట పటిష్ఠతకు సిమెంట్ బస్తాలు వేసి బాదులు పాతి మట్టిని నింపారు. శుక్రవారం మెయిన్‌కెనాల్‌కు నీరు విడుదలతో బాదులు నీటిలో ఒరిగిపోగా, ఇసుకబస్తాలు నీటిలో కలిసిపోయాయి. దీంతో ఎక్కడకక్కడ కట్టలు తెంచుకున్నాయి. వీటిని చూసిన వారు పనులు ఎంత పటిష్ఠంగా చేశారో అర్థమవుతుందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ఐదేళ్లలో కాల్వల అభివృద్ధి చేసిన దాఖలా లేదని ఈ ఏడాది నిధులు మంజూరు చేస్తే పనులన్నీ నాసిరకంగానే చేశారని మండిపడుతున్నారు.



మాట నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం

● ఎమ్మెల్యే ఆనందబాబు



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు.. కుటుంబంలో చదువు కుంటున్న పిల్లందరికీ తల్లికి వందనం నగదు జమచేసి మాట నిలబెట్టుకుందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. శుక్రవారం కొల్లూరు మండలం ఈపూరులో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం, సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 67 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో తల్లికి వందనం పథకం ద్వారా నగదు జమ చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పింఛను రూ.4 వేలకు పెంచి, అంతకు ముందు మూడు నెలల పెన్షన్‌ను కూడా కలిపి రూ.7 వేలు అందజేయడం జరిగిందని గుర్తుచేశారు. మాజీ సీఎం, స్వర్గీయ ఎన్టీఆర్ రూ.60లు పింఛన్ అందించడం ప్రారంభించి 42 ఏళ్లు అయ్యిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దానిని రూ.4 వేలు చేశారన్నారు. విడతల వారీగా పింఛన్ పెంపు టీడీపీ హయాంలోనే జరిగిందన్నారు. ఉచిత సిలిండర్ పథకాన్ని కూడా అమలు చేశామని, ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు హామీ నెరవేర్చబోతున్నట్లు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు తెలిపారు. వైసీపీ పాలనలో 20 ఏళ్లు వెనక్కి వెళ్లిన రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెట్టేందుకు సీఎం చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. ప్రజలంతా ఈ విషయాలు గమనించాలన్నారు. కార్యకర్తలు కూడా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో రాష్ట్రం విధ్వంసం

● మంత్రి అనగాని సత్యప్రసాదు



3వ వార్డులో కరపత్రం అందజేస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె, జూలై 11(ఆంధ్రజ్యోతి): జగన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో ఏనాడు ప్రజల వద్దకు వెళ్లలేదని.. విధ్వంసంగా రాష్ట్రాన్ని తయారు చేస్తే కూటమి ప్రభుత్వం పునఃనిర్మిస్తోందని రాష్ట్ర రెవెన్యూ శాఖమంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని 3వ వార్డులో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికి తిరుగుతూ ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు మంత్రి వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. యువతకు 20 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు.. నారా లోకేశ్ కృషి చేస్తున్నారన్నారు. జగన్‌రెడ్డి పాడుపెట్టిన ప్రజా రాజధాని అమరావతిని శరవేగంతో నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ నెలలలో అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తామని.. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకం అమల్లోకి వస్తుందన్నారు. ఇచ్చిన ప్రతి హామీ కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందని తెలిపారు. రేపల్లె పురపాలకసంఘాన్ని రూ.6కోట్లనిధులతోఅభివృద్ధిచేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధర రావు, రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు మేకా రామకృష్ణ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నల్లమల జోన్ ఫుట్‌బాల్ విజేతగా బాపట్ల



క్రీడాకారులతో అసోసియేషన్ సభ్యులు, కోచ్‌లు

గుంటూరు (తూర్పు), జూలై 11(ఆంధ్రజ్యోతి): గుంటూరులోని పేరేచర్ల మైదానంలో జిల్లా ఫుట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్ బాలుర విభాగంలో రెండు రోజులుగా జరుగుతున్న నల్లమల జోన్ ఫుట్‌బాల్ పోటీలు శనివారంతో ముగిసాయి. గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల జట్లు తలపడ్డాయి. ఫైనల్‌లో గుంటూరు జిల్లా జట్టుపై 3-2 తేడాతో బాపట్ల జట్టు విజయం సాధించింది. అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుమ్మర క్రాంతికుమార్, దుర్గా మోహన్ మాట్లాడుతూ విజేతగా నిలిచిన జట్టు ఈ నెల 12 నుంచి రాజమండ్రిలో జరిగే స్టేట్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటుందని తెలిపారు. అనంతరం విజేతలకు ట్రోఫీలు, సర్టిఫికెట్స్ అందజేశారు.

వేజెండ్ల వాసిపై పీడీ యాక్ట్



పోతినేని గోపి (ఫైల్)

పొన్నూరుటౌన్ (చేబ్రోలు), జూలై 11(ఆంధ్రజ్యోతి): తీవ్ర నేర అభియోగాలు ఎదుర్కొంటున్న వేజెండ్ల గ్రామానికి చెందిన పోతినేని గోపీ అనే వ్యక్తిపై పీడీ యాక్ట్ నమోదుకు ప్రభుత్వం అనుమతించింది. అతనిపై ఇప్పటికే 8 కేసులు నమోదయ్యాయి. రెండు రేప్ కేసులు కూడా ఉన్నాయి. ఒంటరిగా సంచరించే మహిళలు, యువతల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం, చైన్ స్నాచింగ్‌లు, భూదందాలు, బెదిరింపులకు పాల్పడం తదితర అభియోగాలు అతనిపై ఉన్నారు. పలు మార్లు గోపీకి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చినా ఎలాంటి ప్రయోజనం లేదు. దీంతో ఉన్నతాధికారులు అతనిపై పీడీ యాక్ట్ న మోదు చేయాలని ప్రభు త్వానికి ప్రతిపాదనలు పంపడంతో.. అనుమతి లభించింది. గుం టూరులో కూడా ఇతని కేసులు నమోదై ఉన్నాయి. పొన్నూరు నియోజకవర్గంలో మొదటిసారి పీడీ యాక్ట్ నమోదు కావడం చర్చనీయాంశంగా మారింది.

తహసీల్దార్ వైవీ కుటుంబరావు సస్పెన్షన్



తహసీల్దార్ వైవీ కుటుంబరావు

దాచేపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూముల వ్యవహారంలో అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణల నేపథ్యంలో గతంలో దాచేపల్లిలో పనిచేసిన ప్రస్తుతం గురజాల తహసీల్దార్ వైవీ కుటుంబరావును సస్పెండ్ చేస్తూ పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. దాచేపల్లి మండలంలోని కేసానుపల్లి, గామాలపాడు, మాదినపాడు, పెదగార్లపాడు, భట్రుపాలెం గ్రామాల్లో ప్రభుత్వ భూములను ప్రైవేట్ వ్యక్తుల పేర్లపై అక్రమాలకు పాల్పడ్డారని తహసీల్దారు ప్రధానంగా రోపణలున్నాయి. సర్వే నంబర్లు 85/1, 348/15/ 7, 108/18/272, 595/1ఏ, 595/2ఏ, 334/4/1 భూముల్లో అక్రమాలు జరిగినట్టుగా అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. మరో ఆరు నెలల్లో పదవీ విరమణ చేయనున్న తహసీల్దార్ కుటుంబరావును సస్పెండ్ కావడంపై రెవెన్యూ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గతంలో కూడా దాచేపల్లి మండలంలో తంగెడ, పెదగార్లపాడు, కేసానుపల్లి, పందుగుల తదితర గ్రామాల్లో సుమారుగా రెండు వేల ఎకరాల్లో అవకతవకలు జరిగాయని, భూములు అన్యాక్రాంతమయ్యాని గతంలో ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ ఆరోపణల పై పూర్తి స్థాయిలో చర్యలు తీసుకొనేందుకు అధికా రులు దృష్టి సారించారు. మరి కొంత మంది వ్యక్తుల పేర్లు కూడా బయటకు వచ్చే అవకాశం ఉందని రెవెన్యూ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

గంజాయి కేసులో వైసీపీ నాయకుడి అరెస్ట్

గుంటూరు కార్పొరేషన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): అతను ఓ వైసీపీ నాయకుడు. ఆ పార్టీలో పెద్ద నాయకుడిగా గ్రామంలో చలామని అవుతూ.. అధికారంలో ఉన్నప్పుడు గ్రామాన్ని శాసించాడు. అక్రమంగా గంజాయి వ్యాపారం చేస్తూ ఎక్సైజ్ శాఖ అధికారులకు దొరికిపోయాడు. పక్కా సమాచారంతో ఎక్సైజ్ శాఖ అధికారులు వలపన్ని నిందితుడిని అదుపులో తీసుకున్నారు. విచారణ నిమిత్తం అతని సొంత ఇంటికి తీసుకెళ్లగా ఇంటిలో మాజీ సీఎం జగన్, వైసీపీ నాయకులతో దిగిన ఫొటోలు కనిపించాయి. గుంటూరు రూరల్ మండలం వెంగళాయపాలెం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు దేవరకొండ నాగేశ్వరరావుతో పాటు అతని బంధువుని ఎక్సైజ్ శాఖ అధికారులు శుక్రవారం అరెస్ట్ చేశారు. నాగేశ్వరరావు గడిచిన ఆరేళ్లగా వైసీపీలో పెద్ద నాయకుడిగా తిరుగుతున్నాడు. పార్టీ ని అడ్డుపెట్టుకొని పెద్ద ఎత్తున గంజాయి విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో గుంటూరు నుంచి వెంగళయపాలెం వెళ్లే రహదారిలో వల్లభ పాల డెయిరీ వద్ద ఎక్సైజ్ శాఖ టూ టౌన్ సీఐ యశోదర దేవి ఆధ్వర్యంలో ఎస్ఐలు తనిఖీలు చేపట్టారు. నిందితుడు దేవరకొండ నాగేశ్వరరావు, అతని బంధువైన కొండపల్లి ఓం కార్ గోపీ వద్ద 1.55 కేజీల గంజాయి దొరికింది. దీంతో వారి ని అదుపులో తీసుకొని విచారించారు. కొన్ని సంవత్సరాలుగా వారు గంజాయి అక్రమ వ్యాపారం చేస్తున్నట్లు బహిర్గత మైంది. నిందితులు ఇద్దరినీ చేసి, వారి నుంచి మూడు ద్విచక్ర వాహనాలు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనపర చుకున్నట్లు సీఐ తెలిపారు. ఎస్సైలు మూర్తి, మాధవి, సత్యనారాయణ, హనుమంతరావు సిబ్బంది పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	101, 109, 120
చికెన్ విత్ స్కిన్(కిలో)	194.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	205.00

అమృతలూరులో చోరీ

అమృతలూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : అమృతలూరులో పట్ట పగలు చోరీ శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన రాపర్ల మల్లిఖార్జునరావు, తన భార్యతో కలసి మధ్యాహ్నం పని మీద బాపట్ల వెళ్లారు. సాయంత్రం 5 గంటల సమయం తిరిగి వచ్చా రు. ఇంటిలో వెనుక భాగంతలుపు పగలగొట్టి ఉండటంతో అను మానం వచ్చి బీరువాలోని నగలు చూసుకున్నారు. బీరువాలో సుమారు 190 గ్రాములు బంగారం చోరీకి గురైనట్లు గుర్తించారు. చోరీ విషయంను స్థానిక ఎస్ఐ రవితేజకు ఫిర్యాదు చేశారు. విష యం తెలుసుకున్న చుండూరు సీఐ శ్రీనివాసరావు చోరీ జరిగిన గృహంను పరిశీలించారు. క్లూస్ టీం వివరాలు సేకరిస్తున్నారు. ఎస్ఐ రవితేజ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాతగుంటూరులో...

గుటూరు కార్పొరేషన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : పాత గుంటూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీనగర్ మొదటి లైనులో చోరీ జరిగినట్లు పాతగుంటూరు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం లక్ష్మీనగర్ మొదటి లైనుకు చెందిన ఉప్పలపాటి అంకమ్మరావు శుక్రవారం సాయిబాబా గుడి దగ్గరకు వెళ్లి వచ్చే సమయానికి గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో తలుపులు పగులగొట్టి బీరువాలో ఉన్న రూ.8 లక్షల నగదు, రెండున్నర సవర్ల బంగారం చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి

రేపల్లె, జూలై11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేటేరు గ్రామంలో డంపింగ్ యార్డు వద్ద 25 నుంచి 30 ఏళ్లలోపు వయసు గల గుర్తుతెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడని పట్టణ సీఐ మల్లికార్జున్‌రావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం 4గంటల సమయంలో స్థానికుల సమాచారం మేరకు పేటేరులోని డంపింగ్ యార్డు వద్దకు వెళ్లగా చెత్త ఏరుకునే వ్యక్తి అనుమానాస్పద మృతి చెంది ఉన్నాడని చెప్పారు. చుట్టుపక్కల వారిని విచారించగా అతను ఈ ప్రాంత వాసి కాదని చెప్పారని తెలిపారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

బావ మరిది చేతిలో బావ హతం

పొన్నూరుటౌన్, చేబ్రోలు, జులై11(ఆంధ్రజ్యోతి): వ్యసనాలకు బానిసై ప్రతి రోజు సోదరిని ఇబ్బంది పెడుతున్న బావను బావ మరిది హత్య చేసిన ఘటన శుక్రవారం చేబ్రోలు మండలం, గుండవరం గ్రామంలో చోటు చేసుకుంది. చేబ్రోలు పోలీసుల కథనం ప్రకారం.. గుండవరం గ్రామానికి చెందిన నన్నపనేని కృష్ణబాబు (35)కి అదే గ్రామానికి చెందిన మక్కే భువనేశ్వరితో 12 ఏళ్ల క్రితం వివాహం అయింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. వ్యవసాయం చేసే కృష్ణబాబు కొంతకాలంగా మద్యానికి బానిసగా మారాడు. ఈ నేపథ్యంలో భార్యాభర్తలు ఇద్దరి మధ్య తరచూ ఘర్షణ నడుస్తోంది. శుక్రవారం కూడా భార్యాభర్తల మధ్య గొడవ జరగగా భువనేశ్వరి తన సోదరుడు గోపికి ఫోన్ చేసి విషయం చెప్పింది. అక్కడికి చేరుకున్న గోపీ.. సోదరితో గొడవ పడుతున్న బావను క్షణికావేశంలో కర్రతో తలపై బలంగా కొట్టాడు. దీంతో కృష్ణ బాబు తలపై తీవ్ర గాయంతో కింద పడిపోయాడు. స్థానికులు అతనిని వడ్లమూడిలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై మృతుడి తల్లి వీరకుమారి ఫిర్యాదు మేరకు చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. పట్టణంలోని 1వ వార్డు బేతనీకాలనీలో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీశ్రేణులతో కలిసి ఇంటింటా తిరుగుతూ కరపత్రాలు పంచుతూ కార్యక్రమం గురించి వివరించారు. నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, పెట్టుబడులు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రతి కుటుంబాన్ని కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని నాయకులకు, అధికారులకు సూచించారు. ప్రతికుటుంబం అభివృద్ధి చెందాలన్నదే ఆకాంక్ష అన్నారు. ఇదేస్ఫూర్తితో కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజని, కార్యదర్శి కూచిపూడి ఝాన్సీరాణి, చెన్నుపాటి హైమావతి, రమాదేవి, మండల పార్టీ మహిళా అధ్యక్షురాలు కాగిత నాగభూషణమ్మ, జి.గిరిజారాణి, షేక్ నజ్మా, సీనియర్ నాయకులు మందపాటి ఆంద్రేయ, జోషి, లక్ష్మీనారాయణ, డేవిడ్, మరియమ్మ, పద్మ, ఇందు పాల్గొన్నారు.

ప్రతి సమస్యను పరిష్కరిస్తాం

ప్రజలపక్షాన పని చేస్తూ ప్రతి సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. బాపట్ల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలు నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి సంబంధితాధికారులతో మాట్లాడి వాటిని సత్వరమే పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజల సమస్యలు పరిష్కార విషయంలో చిత్తశుద్ది కనబర్చాలన్నారు. ప్రతి అర్జీని పరిశీలించి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీశ్రేణులు పాల్గొన్నారు.



డ్రెయినేజీల పూడికతీతను పరిశీలిస్తున్న కమిషనర్ రఘునాథరెడ్డి

వార్డులలో విస్తృతంగా పర్యటించిన కమిషనర్

బాపట్ల, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు వార్డులలో మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి సిబ్బందితో కలిసి శుక్రవారం విస్తృతంగా పర్యటించారు ఆయా వార్డులలో డ్రెయినేజీల మరమ్మతులను పరిశీలించారు. సూర్యలంకరోడ్డులోని వివేకా ఫాస్టర్ స్కూల్ దగ్గర డ్రెయినేజి మరమ్మతులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కొంతకాలంగా డ్రైనేజీలు శుభ్రం చేయకపోవటం వల్ల సిల్ట్ పేరుకుపోయి మురుగు ముందుకెళ్ళక దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నామని ఆ ప్రాంత ప్రజలకు కమిషనర్ వివరించారు. యుద్ధప్రాతిపదికన డ్రైనేజి పూడిక పనులు పూర్తి స్థాయిలో చేపడుతామని కమిషనర్ హామీనిచ్చారు. అనంతరం మార్కెట్ యార్డు ఎదురు గల పురపాలక సంఘ స్థలాన్ని పరిశీలించారు. 3వ వార్డు రాజీవ్‌గాంధీకాలనీలో పీ4 ద్వారా కమిషనర్ దత్తతు తీసుకున్న బంగారు కుటుంబాన్ని సందర్శించారు. కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. పిల్లలు పాఠశాలకు వెళుతున్నారా అని ఆరా తీశారు. అనంతరం ట్యూషన్ వద్దకెళ్ళి పిల్లల చదువుతీరును తెలుసుకున్నారు. ఏమైన ఇబ్బందులు వస్తే తనకు తెలియజేయాలన్నారు. అలాగే అన్న క్యాంటీన్‌లు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్ సీహెచ్ కరుణ పాల్గొన్నారు.

బాపట్లలో భారీ వర్షం

● హర్షం వ్యక్తం చేసిన రైతులు

● లోతట్టుప్రాంతాలలో రోడ్లపై నిలిచిన నీరు

బాపట్ల, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : వాతావరణంలో ఒక్కసారిగా వచ్చిన మార్పుతోపాటు భారీవర్షం కురిసింది. గత కొద్దిరోజులుగా వేడిగాలులతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షంతో చల్లపడ్డారు. ఉదయం నుంచి ఉక్కపోతతో అల్లాడిపోయిన ప్రజలు భారీవర్షం కారణంగా వాతావరణం చల్లబడటంతో సంతోషం వ్యక్తం చేశారు. గంటకుపైగా కురిసిన వర్షంతో లోతట్టుప్రాంతాలలోని రోడ్లుపై నీరు నిలిచింది. వరుణుడిపై ఆధారపడి సాగు ప్రారంభించిన రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే తీరప్రాంత గ్రామాలలో వెదసాగు ప్రారంభించారు. వెదపెట్టిన పొలాలకు కాల్వలో నీరును ఇంజన్‌లతో పొలాలకు పెడుతున్న సమయంలో ఈవిధంగా వర్షం కురియటంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. కురిసిన వర్షం రైతుకు మేలు చేసింది. వాతావరణం చల్లబడింది.



బాపట్లలో కురుస్తున్న వర్షం

పిట్టలవానిపాలెం మండలంలో...

పిట్టలవానిపాలెం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : పిట్టలవానిపాలెం మండలంలో భారీ వర్షంతో రైతులు కొంత హర్షం వ్యక్తం చేసినా వెదసాగు పద్ధతిలో వరిసేద్యం చేయటానికి దున్నుకున్న పంట భూములు వర్షం కారణంగా రైతులు కొంత ఇబ్బంది పడ్డారు. మరలా తిరిగి వెద పద్ధతి పెట్టేందుకు వ్యవసాయ భూమిని దున్నుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. వరి నాటుకునేందుకు వరి నారులు పోసుకున్న విత్తనాలు దెబ్బతింటాయోమోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భావ వేడుకలు

బాపట్ల, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ కొత్తబస్టాండ్ ఆవరణలో ఎంప్లాయీస్ యూనియన్ 74వ ఆవిర్భావ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి యూనియన్ జిల్లా కార్యదర్శి వైఎస్ రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. డిపో అధ్యక్షుడు టి.చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 74 సంవత్సరాలుగా ఆర్టీసీ కార్మికుల కోసం ఎంప్లాయిస్ యూనియన్ చేస్తున్న పోరాటాలు గురించి వివరించారు. కార్మికుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అందించటమే కాకుండా కావాల్సిన సౌకర్యాలు, రావాల్సిన రాయితీలు, ఉద్యోగులకు అందించే ప్రయోజనాలు కోసం యూనియన్ కీలకపాత్ర పోషిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీఎస్ నారాయణ, ఎం.కోటేశ్వరరావు, చలపతి, ఎంపి కుమార్, ఐఎస్ రావు, అమరావతి మహిళా చైర్‌పర్సన్ పి.రజని పాల్గొన్నారు.

శ్రీ పెద్దింటమ్మకి శాకాంబరి దేవిగా అలంకారం

కర్లపాలెం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెంలో ఉన్న శ్రీపెద్దింటమ్మ అమ్మవారికి భక్తులు శుక్రవారం పలు రకాల కూరగాయలతో శాకాంబరిదేవిగా విశేష అలంకరణ చేశారు. పలురకాల పండ్లు, కూరగాయలు, ఆకుకూరలతో అమ్మవారికి దండలుగా ప్రత్యేక అలంకరణ చేసి సుందరంగా తీర్చిదిద్దారు. మహిళా భక్తులందరూ అమ్మవారి విశేష అలంకరణ అనంతరం విష్ణు సహస్రనామ పారాయణం చేశారు.



శాకాంబరి దేవిగా శ్రీ పెద్దింటమ్మ

సమస్యలు చెప్పండి.. పరిష్కరిస్తా

● దళితవాడ వాసులతో ఎమ్మెల్యే ఆనందబాబు



చదలవాడ దళితవాడలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు ఏమైనా ఉంటే చెప్పండి... వాటిని పరిష్కరిస్తా అంటూ ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు చదలవాడ గ్రామంలో ఎస్సీ, ఎస్టీ కాలనీ వాసులను కలిసి ప్రశ్నించారు. ఆయన శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి కరపత్రాలు అందజేశారు. సంక్షేమ పథకాలు అందరికి అందుతున్నది లేనిది అడిగి తెలుసుకున్నారు. సమస్యల విషయంపై ప్రశ్నించగా దళితులు తమకు ప్రత్యేకంగా శ్మశాన వాటిక నిర్మాణం నిమిత్తం స్థలాన్ని కేటాయింపు చేసి సహకరించాలని కోరారు. బీసీ కాలనీవాసులు మురుగు కాల్వల నిర్మాణాలు లేక అపరిశుభ్ర వాతావరణంలో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని విన్నవించుకున్నారు. స్పందించిన ఆనందబాబు దళితులకు శ్మశాన వాటిక స్థలాన్ని మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతూ, మురుగు కాల్వల నిర్మాణాలకు అంచనాలతో కూడిన ప్రతిపాదన సిద్ధం చేసి ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గాజుల వెంకట సుబ్బయ్య, వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ అమ్మిశెట్టి కిషోర్‌కుమార్, సొసైటీ చైర్మన్ బొల్లిముంత నాగకుమార్, గ్రామ పార్టీ నాయకులు కోటేశ్వరరావు, ధనుంజయరావు, రాజు, దాను, రమేష్ పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీలు ఒక్కొక్కటిగా అమలు

కొల్లూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల వాగ్దానంలో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వస్తుందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. మండల పరిధిలోని ఈపూరులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి శుక్రవారం ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ఇంటింటికి వెళ్లి ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్‌ల ఆధ్వర్యంలో దాదాపుగా ప్రభుత్వం అమలు చేసిందన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లగా అభివృద్ధి పథంలో రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదనప్రసాద్, జీఎల్‌జీ భగవాన్, యార్లగడ్డ శ్రీనివాసరావు, సుంకర రాంబాబు, యలవర్తి కోటేశ్వరరావు, గూడూరు నాగరాజు, మల్లంపాటి హరి, కన్నెగంటి తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

అరాచకం అంతం కాలేదు : కొల్లా

బాపట్ల, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : జగన్మోహనరెడ్డి అరాచక ప్రభుత్వాన్ని మట్టికరిపించి 11 సీట్లకే పరిమితం చేసి ప్రతిపక్ష హోదా సైతం లేకుండా చావుదెబ్బకొట్టినా వైసీపీ అరాచక, విష సంస్కృతిని మార్చుకోకపోవటం సిగ్గుచేటు అని సంగం డెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి అన్నారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ పరామర్శల పేరుతో జగన్ పర్యటనలు హింసాయుతంగా, పోలీసుల ఆంక్షలను ధిక్కరిస్తూ మనుషుల ప్రాణాలు బలికొనటం, పోలీసుల పైనే దాడులు జరిపేలా అసాంఘిక శక్తులను ప్రోత్సహించి అరాచకాన్ని సృష్టించి భయోత్పాతాన్ని కలిగించటం దారుణమన్నారు.

రోటరీ సేవలు విస్తరింపజేయాలి

● డిస్ట్రిక్ గవర్నర్ డాక్టర్ ఎస్‌వీ రాంప్రసాద్



బాపట్ల రోటరీ క్లబ్ అధ్యక్షుడు వేజండ్ల శ్రీనివాసరావు, నూతన కార్యవర్గం

బాపట్ల, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్‌లో మహిళలను భాగస్వాములుగా చేసి సేవలను విస్తరింప చేయాలని డిస్ట్రిక్ గవర్నర్ డాక్టర్ ఎస్‌వి.రాంప్రసాద్ తెలిపారు. పట్టణంలోని విజయలక్ష్మీపురం రోటరీ కల్యాణ మండపంలో శుక్రవారం రాత్రి నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం జరిగింది. కార్యక్రమానికి రాంప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ బాపట్లలో రోటరీక్లబ్ స్థాపించిన బి.నారాయణరావును స్ఫూర్తిగా తీసుకొని విశిష్టమైన సేవలను ప్రజలకు అందించాలన్నారు. అనంతరం రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా వేజండ్ల శ్రీనివాసరావు, సెక్రటరీగా కొత్త ఆంజనేయ వరప్రసాద్, కోశాధికారిగా కొత్త సుబ్బారావు, టి.సుబ్బారావు ప్రమాణస్వీకారం చేశారు. అదేవిధంగా బోర్డు ఆఫ్ డైరెక్టర్‌లుగా ఇ.హరిబాబు, జేవీ కృష్ణారావు, కె.శ్రీనివాసరావు, టి.కృష్ణమూర్తి, ఎం.సుధీర్‌కుమార్, పి.శ్రీమన్నారాయణ, జిట్టా శ్రీనివాసరావు, చైర్మన్ కమిటీలో బి.శ్రీరామకృష్ణ, సీహెచ్ వెంకటేశ్వరరావు, ఎస్‌కే మస్తాన్‌వలి, ఎస్.రమేష్‌బాబు, టి.మల్లికార్జునరావులను నియమించారు. నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం అనంతరం ఉత్తమ వైద్యసేవలందిస్తున్న ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దార్ధ, డాక్టర్ త్రివేణిలను ఘనంగా సత్కరించి సన్మానించారు. ఎయిమ్ ఫర్ సేవా ఆశ్రమానికి 10సీలింగ్ ఫ్యాన్‌లు, మున్సిపల్ పాఠశాలలకు కూలింగ్ వాటర్‌క్యాన్‌లు పంపిణీ చేశారు. నూతన అధ్యక్షుడు వేజండ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ రోటరీ సేవలను ముందుకు తీసుకెళుతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ పి.రాఘవయ్య, బుర్లె రామసుబ్బారావు, జనసేన సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ, కొల్లా శ్రీనివాసరావు, జిట్టా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యా కమిటీ చైర్మన్‌గా అన్వర్



షేక్ అన్వర్‌ను సన్మానించిన టీడీపీ నాయకులు, ఉపాధ్యాయులు

పిట్టలవానిపాలెం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చందోలు నీలిబంగారయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యాకమిటీ చైర్మన్‌గా షేక్ అన్వర్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా అన్వర్‌ను పిట్టలవానిపాలెం మండల టీడీపీ అధ్యక్షులు ఎండీ అఫ్జల్, బాపట్ల టీడీపీ పార్లమెంట్ మైనార్టీ అధ్యక్షుడు మహ్మద్ ఖాశీం, చందోలు గ్రామ టీడీపీ అధ్యక్షుడు మహ్మద్ రజాక్, టీడీపీ నాయకుడు షేక్ సలీం, చందోలు గ్రామ అభ్యుదయ కమిటీ సెక్రటరి మస్తాన్ బేగ్, పాఠశాల ఉపాధ్యాయులు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బుల్లెమ్మ ఆధ్వర్యంలో అన్వర్‌ను ఘనంగా సన్మానించారు.



పెనుమూడి మెయిన్ కెనాల్‌కు విడుదల చేసిన సాగునీరు

మెయిన్ కెనాల్‌కు సాగునీరు విడుదల

రేపల్లె, జూలై 11(ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవ్వటంతో మెయిన్ కెనాల్‌కు సాగునీరు విడుదల చేశారు. ఖరీఫ్ సీజన్‌కు పంట పొలాలను సిద్ధం చేస్తున్నామని, కృష్ణా జిల్లాలో కాల్వలకు సాగునీరు వదిలారని, డెల్టా ప్రాంతానికి ఇంకా సాగునీరు వదలలేదని, తక్షణమే అధికారులతో మాట్లాడి సాగునీరు విడుదల చేయించాలని రైతులు మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కోరారు. దీంతో స్పందించిన అనగాని నీటిపారుదల శాఖాధికారులతో మాట్లాడి కాల్వలకు సాగునీరు విడుదల చేయాలని, రైతులంతా నీటి కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. అధికారులు స్పందించి మెయిన్ కెనాల్‌కు సాగునీరు వదలటంతో రైతులు ఖరీఫ్ సీజన్‌కు నారుమడులకు వెద పద్ధతిలో విత్తనాలు చిమ్ముకునేందుకు నిమగ్నమయ్యారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె, జూలై 11(ఆంధ్రజ్యోతి) : మండలంలోని 11కేవీ కారుమూరు 11కేవీ బొబ్బర్లంక ఫీడర్లను విద్యుత్ లైన్లు మరమ్మతుల కారణంగా ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడనున్నదని విద్యుత్‌శాఖ డీఈ డి.శ్యామ్‌సుధాకర్‌బాబు తెలిపారు. రేపల్లె రూరల్‌లో ఉన్న కారుమూరు, వేజళ్లవారిలంక , బొబ్బర్లంక, చోడాయపాలెం, కైతేపల్లి, ఉప్పూడి గ్రామాలకు విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడనున్నదని చెప్పారు.

● భట్టిప్రోలు (కొల్లూరు), జూలై 11 (ఆంధ్రజ్యోతి) : రేపల్లె నుంచి భట్టిప్రోలు వరకు ఉన్న విద్యుత్ మెయిన్ లైను మరమ్మతుల దృష్ట్యా మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ శాంతకుమారి అన్నారు.

● కొల్లూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ సుధాకర బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొల్లూరు సబ్ స్టేషన్‌లో గాజుల్లంక ఫీడర్ కింద ఆవులవారిపాలెం, పెసర్లంక, గాజుల్లంక, ఈపూరులంక సబ్ స్టేషన్ పరిధిలో ఈపూరులంక, చింతల్లంక, పెదల్లంక గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

ఆదిఆంధ్ర కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా 'గుండాల'

బాపట్ల, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : దగ్గుమల్లివారిపాలెం ఆదిఆంధ్ర కోఆపరేటివ్ ఫార్మింగ్ సొసైటీ ఎన్నిక శుక్రవారం ఏవీవీ ఉన్నత పాఠశాలలో జరిగింది. ఎన్నికల అధికారిగా అసిస్టెంట్ రిజిస్ట్రార్ లలితకుమారి వ్యవహరించారు. సొసైటీలో మొత్తం 177 మంది సభ్యులు ఉండగా 158 మంది సభ్యులు పాల్గొన్నారు. గుండాల విజయడెవిడ్‌రాజును అధ్యక్షుడిగా, బిళ్ళా ఎడ్విన్‌రాజు, సలగల ఏసమ్మ, కూచిపూడి పారిశుద్ధం, మేకల సత్యానందంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఎన్నికైన వారికి నియామక పత్రాలను అందజేశారు. వరుసగా తనను 4వసారి అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు విజయడేవిడ్‌రాజు కృతజ్ఞతలు తెలిపారు. సొసైటీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

కోర్కెలు తీర్చకపోతే నిరవధిక సమ్మె చేస్తాం : సీఐటీయూ

బాపట్ల, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘంలోని ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికుల న్యాయమైన కోర్కెలను తీర్చకపోతే నిరవధిక సమ్మెకు వెళతామని సీఐటీయూ కార్యదర్శి కె.శరత్ తెలిపారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు.



బాపట్ల వ్యవసాయ మార్కెట్ యార్డు ఎదురు రోడ్డు పక్కనే నీరు నిలిచి తటాకంగా ఏర్పడిన చిత్రం



బాపట్ల వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల ఎదురు రోడ్డు పక్కనే నిలిచిన వర్షపునీరు

రోడ్లపై తటాకాలను తలపిస్తున్న వర్షపు నీరు

● పట్టించుకోని మున్సిపల్ అధికారులు

బాపట్ల, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : గత పాలకులు కోట్ల రూపాయలు వెచ్చించి రోడ్డు విస్తరించారు. రోడ్డుకు ఇరువైపుల డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేశారు. వర్షం వచ్చినప్పుడు రోడ్లపై నిలిచిన నీరు డ్రెయినేజీ ద్వారా బయటకు వెళ్ళే ఏర్పాటు చేయటం మాత్రం మరిచారు. దీంతో బాపట్ల వ్యవసాయ మార్కెట్ యార్డు దగ్గర నుంచి చీరాల రోడ్డులోని విద్యుత్ సబ్ స్టేషన్ వరకు రోడ్డు పక్కనే నీరు నిల్వటం పరిపాటిగా మారింది. వర్షం వచ్చిందంటే రోడ్లపై ఎక్కడపడితే అక్కడ నీరు నిలిచిపోతుంది. వర్షం ఎక్కువైతే డ్రెయినేజీలో నీరు కూడా రోడ్లపైకి వస్తుంది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా డ్రెయినేజీ వ్యవస్థ సరిగ్గాలేక ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నాయి. కర్లపాలెం రోడ్డులోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ఎదురు రోడ్డుపై నీరు నిలిచి తటాకాన్ని తలపిస్తుంది. డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల ఎదురు టీచర్స్‌కాలనీ వరకు రోడ్డుపై పెద్దఎత్తున నీరు నిలిచింది. అదేవిధంగా ఆర్టీసీ గ్యారేజికెళ్ళే రోడ్డు పక్కనే కూడా ఈవిధంగా నీరు నిలిచి ఉంది. కొత్తబస్టాండ్ దగ్గర, విద్యుత్‌సబ్ స్టేషన్ దగ్గర ఇలాంటి పరిస్థితే ఉంది. అధికారుల నిర్లక్ష్యంతో రోడ్లపై నిలిచిన నీరు డ్రెయినేజీ ద్వారా బయటకు వెళ్ళకుండా రోడ్లపై ప్రవహించటం అనేక విమర్శలకు ఊతమిస్తున్నది. మున్సిపల్ అధికారులు మాత్రం తమకేమి పట్టదన్నట్లు చోద్యం చూస్తున్నారు. వర్షం వచ్చినప్పుడు రోడ్లపై నిలిచిన నీరు మురుగుగా మారి దోమలు వ్యాప్తి చెందినప్పుడు మాత్రమే అధికారులు స్పందిస్తున్నారు తప్ప సమస్య శాశ్వత పరిష్కారానికి మాత్రం చర్యలు చేపట్టటం లేదు. ఉన్నతాధికారులు దీనిపై స్పందించి తగు చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ప్రజల సమస్యల పరిష్కారం కోసమే వేదిక

● ప్రజా ఫిర్యాదుల కార్యక్రమానికి 115 అర్జీలు



అర్జీలను స్వీకరిస్తున్న గూడపాటి శ్రీనివాసరావు తదితరులు

రేపల్లె, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే ప్రజాఫిర్యాదుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ప్రజాఫిర్యాదుల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారం కోసమే పని చేస్తుందని, వారు ఇచ్చిన ఫిర్యాదులన్నీ పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. మొత్తం 115 ఫిర్యాదులు అందాయని వాటిల్లో ఎక్కువగా 90 నివేశన స్థలాలు, భూసమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులు చేసుకున్నారన్నారు. అదేవిధంగా పెన్షన్‌లు, రహదారులు, రేషన్ కార్డులు, గృహాల కోసం దరఖాస్తులు చేసుకున్నారని, వాటిని పరిశీలించి ఆయా కార్యాలయాలకు పంపి పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జీవీ నాగేశ్వరరావు, బొర్రా సూర్యరాజు, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, దున్నా జయప్రద, పిన్నిబోయిన లక్ష్మీనరసింహ, కారుమూరు సర్పంచ్ గుడిఅంక సుబ్బారావు పాల్గొన్నారు.

త్రిసభ్య కమిటీ రైతు ప్రయోజనాలకు కృషి చేయాలి

● ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘానికి ఎంపికైన త్రిసభ్య కమిటీ సభ్యులు రైతు ప్రయోజనాలకు కృషి చేయాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సూచించారు. మండల పరిధిలోని ఈపూరు పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి శుక్రవారం ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, వైసీపీ హయాంలో సహకార సంఘాలలో ఆ పార్టీ నాయకులు విచ్చలవిడిగా అవినీతి చేశారన్నారు. అలాంటి వాటిని వెలికితీసి రైతులకు మేలు చేసేలా చూడాలన్నారు. సంఘ కార్యాలయానికి సంబంధించిన భవనం శిథిలావస్థకు చేరిందని భవన నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం చైర్మన్‌గా మేకా దివాకరేంద్ర చౌదరి, డైరెక్టర్లుగా ధూళిపాళ్ల రామాంజనేయులు, వాసుమల్లి రత్నబాబులతో ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్మన్, డైరెక్టర్లను దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

మైనేనిని మండల పార్టీ అధ్యక్షుడిగా కొనసాగించాలి

కొల్లూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ మండల అధ్యక్షుడిగా మైనేని మురళీకృష్ణను కొనసాగించాలని టీడీపీ నాయకులు పార్టీ అధిష్టానానికి శుక్రవారం విజ్ఞప్తి చేశారు. కొల్లూరులోని ఎంప్లాయీస్ రిక్రియేషన్ క్లబ్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో అనంతవరంనకు చెందిన టీడీపీ నాయకుడు నాగళ్ల వెంకటకృష్ణారావు మాట్లాడుతూ, మైనేని సుమారు 30 ఏళ్లుగా కొల్లూరు మండలంలో పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. పాల కేంద్రం అధ్యక్షుడిగా మొదలైన ఆయన ప్రస్థానం జడ్పీటీసీ, ఎంపీపీ, కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా పని చేసి ఆ పదవులకే వన్నె తెచ్చారన్నారు. 20 గ్రామాలకు పైగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు మైనేని మండల పార్టీ అధ్యక్షుడిగా కొనసాగాలని ఇటీవల జరిగిన అభిప్రాయ సేకరణలో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు దృష్టికి తీసుకు వచ్చారన్నారు. కార్యకర్తల అభిప్రాయాలను దృష్టిలో ఉంచుకుని అధిష్టానం మరోసారి మండల పార్టీ అధ్యక్షుడిగా మైనేనికి అవకాశం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం ద్వారా నామినేటెడ్ పదవుల భర్తీ విషయంలో కూడా పార్టీ కోసం పని చేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. టీడీపీ నాయకులు కొల్లూరు నాగశ్రీధర్, నాగళ్ల రాంబాబు, సుంకర శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మంత్రిపాలెం సొసైటీ అధ్యక్షుడిగా సాంబశివరావు

రేపల్లె, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : రైతులకు అండగా నిలిచి వారి సమస్యలు పరిష్కారం కోసం కృషి చేయాలని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం నగరం మండలం మంత్రిపాలెం పీఏసీఎస్ సొసైటీ అధ్యక్షుడిగా ఎన్నికైన రావి సాంబశివరావును ఆయన శాలువాకప్పి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉంటూ వారికి కావాల్సిన ఎరువులను సకాలంలో అందిస్తూ రుణసదుపాయాలను సమకూరుస్తూ ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తొట్టెంపూడి సుభాష్, అల్లపర్తి సాంబశివరావు, గార్లపాటి సాంబశివరావు, మేకా పసి, తదితరులు పాల్గొన్నారు.



సాంబశివరావును అభినందిస్తున్న మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్

రేపు ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం

నగరం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ తన 37వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సంస్థాగత సామాజిక బాధ్యతగా ఉచిత మెగా వైద్య శిబిరాలను నిర్వహిస్తుందని క్లస్టర్ బిజినెస్ హెడ్ డాక్టర్ వై.కార్తీక్‌చౌదరి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈనెల 13వ తేదీ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు శ్రీవెలగపూడి రామకృష్ణ మెమోరియల్ కళాశాల ప్రాంగణంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఈ శిబిరంలో గుండె, మెదడు, నరాలు, జీర్ణకోశ, ఊపిరితిత్తులు, ఎముకలు, కీళ్ళవ్యాధులు, స్త్రీలు, ప్రసూతి, చిన్నపిల్లలు, జనరల్ మెడిసిన్, అత్యవసర వైద్యవిభాగాల నిపుణులు సేవలు అందించనున్నట్టు తెలిపారు. వైద్య శిబిరాన్ని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రారంభించనున్నారు. వైద్య శిబిరానికి హాజరయ్యేవారు తమ పాతమెడికల్ రిపోర్ట్స్ వెంట తీసుకురావాలని ఆయన కోరారు. రక్తపోటు, షుగర్, బాడిమాస్ ఇండెక్స్(బిఎం), ఈసీజీ వంటి ప్రాథమిక పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధ్యం

● మాస్టర్ ట్రైనర్ నీలం ప్రకాష్‌కుమార్, ఎఎఫ్‌వో శ్రీలక్ష్మి

భట్టిప్రోలు (కొల్లూరు), జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ నీలం ప్రకాష్‌కుమార్, ఎఎఫ్‌వో శ్రీలక్ష్మిలు పేర్కొన్నారు. మండల పరిధిలోని చింతమోటులో ఎన్‌పిఎం దుకాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఎఫ్‌వో మాట్లాడుతూ, అజ్ఞాస్త్రాన్ని కోడిగుడ్డు, నిమ్మరసం, పండ్ల రసాలతో తయారు చేయడం జరిగిందన్నారు. ప్రకృతి సిద్ధమైన కషాయాలతో గ్రోత్ ప్రమోటర్స్ తయారు చేయడం జరుగుతుందన్నారు. ప్రకాష్ మాట్లాడుతూ, ప్రకృతి సిద్ధంగా పండించిన పంటలు ఆహారంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో వెల్లటూరు ఇన్‌చార్జి సునీత, చందోలు సుశీల, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రాప్యారిస్‌లో బోటు షికారు

- నిజాంపట్నం కాల్వలో ఏర్పాటుకు సన్నాహాలు
- సాధ్యాసాధ్యాలను పరిశీలించిన ఏపీ టూరిజం అధికారులు
- మంత్రి మనోహర్ ఆలోచనలకు పదేళ్ల తర్వాత కార్యరూపం
- ఇది సాకారమైతే తెనాలికి కొత్త అందాలు



కాల్వల మ్యాప్‌ను పరిశీలిస్తున్న టూరిజం జీఎం నాగేశ్వరరావు, సబ్ కలెక్టర్ సంజన సింహా తదితరులు

తెనాలి, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రాప్యారిస్ అన్న పేరుకు మరింత సార్థకత చేకూర్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. అందుకు తగ్గట్లుగా తెనాలిని బోటు షికారు, గ్లాస్ బ్రిడ్జిపై నడకతో పాటు.. చిన్నారుల కోసం పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు ఎట్టకేలకు ఒక అడుగు ముందుకు పడింది. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఉమ్మడి రాష్ట్రంలో స్పీకర్‌గా ఉన్న సమయంలోనే తెనాలిలో మూడు కాల్వ కట్టలను సుందరీకరించి, బోటు షికారు ఏర్పాటు చేయాలని ఆలోచించారు. అయితే అప్పట్లో అది ఆచరణకు నోచుకోలేదు. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మంత్రిగా బాధ్యతలు చేపట్టిన మనోహర్ దీనిపై దృష్టి పెట్టారు. ఇటీవల టూరిజం, రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులతో దీనిపై చర్చ జరిపారు. ఆయన ఆలోచనలో భాగంగానే శుక్రవారం పర్యాటక శాఖ ప్రత్యేక బృందం తెనాలి, దుగ్గిరాలలో కాల్వలను పరిశీలించింది. తెనాలి పట్టణం నడిబొడ్డు నుంచి ప్యారిస్ తరహాలో మూడు కాల్వలు ప్రవహిస్తుండటంతో ఆంధ్రా ప్యారిస్‌గా పేరు వచ్చిన సంగతి తెలిసిందే. ఎల్లప్పుడూ నీటి ప్రవాహంతో కళకళలాడే కాల్వలతో పాటు పచ్చందాలను తీర్చిదిద్దగల అవకాశాలు ఉన్నా.. ఇప్పటి వరకు వీటిని ఆచరణలో పెట్టే నాథుడు కరువయ్యాడు. కళా రంగానికే కాక ఎన్నో ప్రాముఖ్యతలకు నిలయమైన తెనాలిలో పర్యాటక శోభ మాత్రం అంతంత మాత్రంగానే ఉంది. అయితే ఆ ఆలోచన చెరిపి వేస్తూ ఒక అందమైన పర్యాటక హబ్‌గా తెనాలిని తీర్చిదిద్దేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు.

ఆక్రమణలు, ఆటంకాలు తొలగిస్తే..

వైకుంఠపురం గుడి దగ్గర నుంచి వీఎస్ఆర్ కళాశాల వరకు నిజాంపట్నం కాల్వ ఒకటిన్నర కి.మీ పొడవు ఉంటే దీనిలో కొంత మేర స్పీడ్ బోట్లు, మరికొంత ప్రదేశంలో నెమ్మదిగా వెళ్లే పెడల్ బోట్లను ఏర్పాటు చేయాలనేది పర్యాటక శాఖ ఆలోచన. ఇది జరగాలంటే కాల్వపై ఆక్రమణలు తొలగించాల్సిన అవసరం ఉంది. ఈ కాల్వకు ఇరువైపులా ఉండాల్సిన వెడల్పు లేకుండా కొన్నిచోట్ల శాశ్వత ప్రతిపాదికన గోడలు కట్టి కొన్ని వ్యాపారాల నిర్వహణ కోసం ఆక్రమణలకు పాల్పడ్డారు. స్పీడు బోటు షికారు సాధ్యం కావాలంటే వీటిని తొలగించి కాల్వను వెడల్పు చేయాల్సిందే. ముఖ్యంగా కొత్త వంతెన, మార్కెట్ వంతెన, రైల్వేస్టేషన్ వంతెన, వీఎస్ఆర్ కళాశాల ఎదురు ఉన్న వంతెనల దగ్గర చిన్న, పెద్ద వ్యాపారులు కాల్వల్లోకి ఆక్రమించేసి మరీ నిర్మాణాలు చేసేశారు. అప్పట్లో వీటిని అడ్డుకోవాల్సిన ఇరిగేషన్ శాఖ రాజకీయ, ఇతర కారణాలతో వదిలి వేసింది. ఇదిలా ఉంటే వార్ఫ్ కట్టపై టింబర్ డిపోలు దశాబ్దాలు తరబడి ఉంటూ వచ్చాయి. గతంలో ఆటోనగర్ ఏర్పాటు అయ్యాక వీరందరిని అక్కడికి తరలి పోవాలని ఆదేశించినా రాజకీయ ప్రమేయంతో చాలా వరకు కట్టపైనే ఉండిపోయారు. వారి లీజు అనుమతులు కొన్ని ఇప్పటికే పూర్తి అయిపోతే మరికొందరు పొడిగించుకుంటూ వస్తున్నారు. అయితే వీటి విషయంలో నీటి పారుదల శాఖ ఏం నిర్ణయం తీసుకుంటుంది అనే దానిపై పర్యాటక కల నెరవేరే విషయం ఆధారపడి ఉంది.

ఏపీ టూరిజం శాఖ జీఎం నాగేశ్వరరావు, జిల్లా టూరిజం శాఖ అధికారి శ్రీరమ్య, మరికొందరు పర్యాటక శాఖకు చెందిన సభ్యులు, సబ్ కలెక్టర్ సంజన సింహాతో కలసి కాల్వలను పరిశీలించారు. పట్టణం మధ్య నుంచి తూర్పు, పశ్చిమ, నిజాంపట్నం కాల్వలు ప్రవహిస్తుంటే వీటిలో నిజాంపట్నం కాల్వ బోటు షికారుకు అనుకూలంగా ఉంటుందని నిర్ణయించారు. ఈ చానల్ కింద కేవలం 22,124 ఎకరాలు మాత్రమే సాగు అవుతుండటంతో నీటి విడుదలకు సంబంధించి సమస్యలు కూడా తక్కువగానే ఉంటాయి. సాగుకు అవసరమైన నీటిని వదులుతూనే బోటు షికారు కోసం అవసరమైన నీటిమట్టం నిర్వహించేందుకు అవకాశం కూడా ఉంది. దీనికి తోడు పర్యాటకానికి అవసరమైన అన్ని హంగులను తీర్చిదిద్దేందుకు వార్ఫ్ కట్ట అనుకూలంగా ఉండటంతో ఈ కాల్వపై బోటు షికారు ఆసక్తికరంగా ఉంటుందని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు వైకుంఠపురం వంతెన దగ్గర నుంచి వీఎస్ఆర్ కళాశాల ఎదురు ఉన్న వంతెన వరకు ఒకటిన్నర కిలోమీటర్ల పొడవు నిజాంపట్నం కాల్వను అధికారుల బృందం పరిశీలించింది. బోట్లు ఆపి ఎక్కేందుకు ఎక్కడ అనుకూలంగా ఉంది. ఫుడ్ కోర్టు, గార్డెనింగ్ చేసేందుకు ఏ ప్రాంతాన్ని ఎంపిక చేయాలి, మరింత ఆకర్షణీయతను పెంచేలా గ్లాస్ బ్రిడ్జ్ వంటి వాటిని ఎక్కడ నిర్మిస్తే బాగుంటుంది అనే అంశాలకు సంబంధించి ప్రాంతాల వారీ పరిశీలన చేశారు. నిజాంపట్నం కాల్వకు నీటి విడుదలకు సంబంధించి దుగ్గిరాలలో ఉన్న లాకులను ఈ బృందం సందర్శించింది. నీటి విడుదల తీరు, ఎంతవరకు నీటి మట్టాన్ని నిర్వహించవచ్చనే అంశాలను కూడా పరిశీలించారు. ఆదివారం ట్రయల్ రన్ కింద ఒక పర్యాటక బోటును విజయవాడ నుంచి తీసుకువచ్చి నిజాంపట్నం కాల్వలో పర్యటించడం ద్వారా పూర్తి అంచనాకు రావాలని పర్యాటక బృందం నిర్ణయించింది.

స్టీమ్ రైస్‌తో 'రీ సైక్లింగ్'కు చెక్!

- రేషన్‌లో స్టీమ్ రైస్ పంపిణీ చేయాలి
- అప్పుడే దారి మళ్లింపు తగ్గే అవకాశం
- సన్న రకాల సాగు, దిగుబడి పెంచాలి
- ఎరువు విచ్చలవిడి వినియోగంతో.. వరిలో నాణ్యత నానాటికీ తగ్గుతోంది
- ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధనా సంచాలకులు సత్యనారాయణ



డాక్టర్ పీవీ సత్యనారాయణ

గుంటూరు సిటీ, జూలై 11(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం రీసైక్లింగ్ జరగకుండా ఉండాలంటే.. కార్డు దారులకు స్టీమ్ రైస్ పంపిణీచేయడం మంచిదని.. ఇలా చేస్తే బియ్యం రీ సైకిలింగ్‌కు అవకాశం ఉండదని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వావిద్యాలయం పరిశోధనా సంచాలకులు డాక్టర్ పీవీ సత్యనారాయణ తెలిపారు. మధ్యస్థ సన్న రకాలకు చెందిన వరి ధాన్యాన్ని స్టీమ్ రైస్‌గా మార్చటం వల్ల బియ్యం నాణ్యత కూడా పెరుగుతుందని, తినేందుకు కూడా బాగుంటుందని చెప్పారు. బుధవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. తినేందుకు యోగ్యమైన స్టీమ్ రైస్‌ను పంపిణీ చేయటం ద్వారా బియ్యం దారి మళ్లింపు సమస్యకు కూడా పరిష్కారం అవుతుందని తెలిపారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో ప్రస్తుతం ఇస్తున్న బియ్యం నిల్వ ఉంచిన ధాన్యం నుంచి కాకుండా, కోత కోసిన వెంటనే నూర్పి మిల్లు ఆడించి అందిస్తున్నారని చెప్పారు. దీంతో బియ్యం సరిగ్గా మగ్గక అన్నం వండినప్పుడు ముద్ద కావటం, రుచిగా లేకపోవడం, వెంటనే మెత్త పడటం జరుగుతుందన్నారు. గత 20 ఏళ్ల కాలాన్ని కొలమానంగా తీసుకుంటే సన్న రకం బియ్యం వాడే సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 55 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తుండగా, కేవలం 15 లక్షల ఎకరాల్లో మాత్రమే సన్న రకాలు పండిస్తున్నారని చెప్పారు. దీనిలో కేవలం 25 లక్షల టన్నుల బియ్యం మాత్రమే ఉత్పత్తి అవుతోందని తెలిపారు. మిగిలిన 40 లక్షల ఎకరాల్లో మధ్యస్థ, సన్న రకాలు, సన్నని పొడవు రకాలు, దొడ్డు రకాలు సాగు చేస్తున్నారని చెప్పారు. ఇలా 60 లక్షల టన్నుల బియ్యం ఉత్పత్తి అవుతోందని తెలిపారు. ఆ 60 లక్షల టన్నులలోని ఎంటీయు-1121, ఎంటీయు-7029, ఆర్‌జీఎల్-2537, ఎంటీయు-1318, ఎంటీయు-1061, ఎంటీయు-1064 రకాలకు చెందిన సుమారు 30 లక్షల టన్నుల బియ్యం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందిస్తున్నారని డాక్టర్ సత్యనారాయణ తెలిపారు. మిగిలిన 30 లక్షల టన్నులు ఉప్పుడు బియ్యం, ఇడ్లీ రవ్వగా మార్చడం ద్వారా ఇతర రాష్ట్రాలు, దేశాలకు ఎగుమతి చేస్తున్నారని చెప్పారు.

మధ్యస్థ సన్న రకాలే అనుకూలం...

రాష్ట్రంలో విస్తృతంగా సాగవుతున్న ఎంటీయు-1124(శ్రీ ధృతి), ఎంటీయు-1318, ఎంటీయు-7029(స్వర్ణ), ఎంటీయు-1061(ఇంద్ర), బీపీటీ-1100(బడవ మసూరి), ఆర్‌జీఎల్-2537(శ్రీకాకుళం సన్నాలు), ఎంటీయు-1064(అమర), ఎంటీయు-2761, బీపీటీ-3291 మధ్యస్థ రకాలు తినేందుకు చాలా అనుకూలమని డాక్టర్ సత్యనారాయణ చెప్పారు. నిజానికి ఈ రకాలు తక్కువ పురుగు మందులు వాడి సాగు చేస్తారని తెలిపారు. కాకపోతే ధాన్యం మూడు నుంచి నాలుగు నెలలు నిల్వ ఉంచి బియ్యం ఆడించి వాడుకోవాలని సూచించారు.

ఎరువుల వాడకం ప్రమాదకరంగా మారింది

ఎక్కువ దిగుబడుల కోసం రైతులు విచక్షణా రహితంగా ఎరువులు వాడటంపై డాక్టర్ సత్యనారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. ఎక్కువగా నత్రజని, తక్కువగా పోటాష్ వాడటం వల్ల వరి గింజ నాణ్యత తగ్గుతుందన్నారు. వరిలో సమగ్ర ఎరువుల యాజమాన్యంతో పాటు పచ్చిరొట్ట సాగు, చిరు పొట్ట దశలో పొటాష్ ఎరువును ఎకరానికి 15 నుంచి 20 కిలోలు విధిగా వాడటం వల్ల బియ్యం నాణ్యత పెరుగుతుందని సత్యనారాయణ పేర్కొన్నారు.

సన్న రకాలకు దోమ కాటు పోటు

ప్రజలు ఎక్కువగా ఇష్టపడుతున్న బీపీటీ-5204(సాంబ మసూరి/కర్నూలు సోనా) అన్ని ప్రాంతాల్లో ఎక్కువ మొత్తంలో సాగు కాక పోవటానికి దోమ కాటు కూడా ఒక కారణమని సత్యనారాయణ వెల్లడించారు. దీంతో, ఈ రకాలు కొన్ని ప్రాంతాలకే పరిమితమయ్యాయని తెలిపారు. వాటిని ఎక్కువ ప్రాంతాల్లో సాగు చేసేందుకు వీలుగా యూనివర్సిటీ ద్వారా ప్రయత్నాలు చేస్తున్నామని వివరించారు.

విద్యుత్ సరఫరాలో..

అంతరాయాలపై దృష్టిసారించాలి



మాట్లాడుతున్న సీఎండీ పుల్లారెడ్డి, డైరెక్టర్‌లు మురళీకృష్ణయాదవ్, వెంకటేశ్వర్లు

- సెక్షన్ స్థాయిలో సూర్యఘర్ కనెక్షన్‌లు పెంచాలి
- సమస్యలుంటే నేరుగా కలవొచ్చు
- ఏపీ సీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి

గుంటూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో లోవోల్టేజ్ సమస్యలు ఎక్కడా ఉండకూడని.. వినియోగదారుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకూడదని ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరక్టర్ (సీఎండీ) పి.పుల్లారెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. గుంటూరు సంగడిగుంటలోనున్న విద్యుత్ భవన్‌లో గుంటూరు సర్కిల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ పుల్లారెడ్డి, టెక్నికల్ డైరక్టర్ ఆవుల మురళీకృష్ణ యాదవ్ సర్కిల్ పరిధిలోని డివిజన్‌లు, సబ్ డివిజన్‌ల వారీగా వివిధ అంశాలపై సమీక్షించారు. ప్రధానంగా పీఎం సూర్య ఘర్ పథకంపై ప్రజల్లో మరింత విస్తృత ప్రచారం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం దరఖాస్తుల దశలో ఉంటున్నారని, సెక్షన్ స్థాయిలో కనీసం పది మంది అయినా సోలార్ పలకలు ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇది భవిష్యత్తు అవసరమని, దీనిలో వెనుకబడుతున్నామని, మరింతగా ప్రచారం కల్పించి సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకొనేలా చొరవ చూపాలని స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలపై దృష్టి సారించాలన్నారు. అవసరాలకు అనుగుణంగా స్టోర్‌లో పరికరాలున్నాయని, ఎటువంటి సమస్యలున్నా నేరుగా తమను కలవవొచ్చని సీఎండీ తెలిపారు. వ్యవసాయ కనెక్షన్‌ల మంజూరులో నిర్లక్ష్యం వద్దని, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్స్‌ను తగ్గించాలని, నిర్వహణ పక్కాగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఫైనాన్స్ డైరెక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, సీజీఎం రామ్‌దాస్, గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ చల్లా రమేష్, గుంటూరు టౌన్-1, తెనాలి డివిజన్‌ల ఆపరేషన్ ఈఈలు టి.శ్రీనివాసబాబు, చిరంజీవి, పలువురు ఏడీఈలు, ఏఈలు, జేఏవోలున్నారు. అనంతరం గుంటూరు శివారులోని అడవి తక్కెళ్ళపాడు టిడ్కో సముదాయం వద్దనున్న 33/11 కేవీ సబ్ స్టేషన్‌ను సీఎండీ పుల్లారెడ్డి, డైరక్టర్ మురళీకృష్ణయాదవ్ పరిశీలించారు. నగరంలో నిరంతర విద్యుత్ సరఫరాకు అధికారులు మరింత కృషి చేయాలని సూచించారు.

మాజీ ఎమ్మెల్యే మద్దాళి గిరి బకాయి రాబట్టాలి

మాజీ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ తన స్పిన్నింగ్ మిల్లులకు సంబంధించి విద్యుత్ శాఖకు బకాయిపడిన రూ. 42 కోట్లు వెంటనే రాబట్టాలని ఏపీ సీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డికి ముస్లిం సేన రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సుభాని విజ్ఞప్తి చేశారు. సంగడిగుంటలోని విద్యుత్ భవన్‌కు విచ్చేసిన సీఎండీని కలిసిన సుభాని ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. మద్దాళి గిరి నుంచి విద్యుత్ బకాయిలను అధికారులు చట్టప్రకారం రాబట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సామాన్యులకు ఒక న్యాయం, అధికారం ముసుగులో బకాయిలు చేసిన వారికి ఒక న్యాయం ఉండకూడదని కోరారు.



సీఎండీకి వినతిపత్రం అందజేస్తున్న సుభాని

విస్తారంగా సాగుచేసినారు.!

●లాభదాయకంగా వరినారు పెంపకం ●గురువుమెరక భూములు ప్రసిద్ధి



కర్లపాలెం మండలంలోని గరువు మెరక భూముల్లో నారుమడి సాగు

బాపట్ల, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : వరినారు పెంపకానికి గరువు మెరక భూములు ఎంతో ప్రసిద్ధి. దశాబ్దాలుగా గుంటూరు, పల్నాడు జిల్లాలకు సంబంధించిన రైతులు ఈ ప్రాంతంలో పెంచిన వరినారు కొనుగోలు చేసి.. తీసుకెళ్లి నాట్లు వేయడం జరుగుతుంది. ఈ ప్రాంతంలోని రైతులు నారు పెంచి సెంట్లు లెక్కన విక్రయిస్తారు. లేకుంటే ఆయా ప్రాంతాలు నుంచి వచ్చే రైతులు బాండు రాసుకొని ఇక్కడ రైతుల ద్వారా నారు పెంచుతారు. గతంలో బుంగపోత కార్మికులు నారు ఎక్కువగా పెంచేవారు. దొరువులు ఉపయోగించి బుంగపోత పోసి నారు పెంచే సన్న, చిన్నకారు రైతులు నేడు విద్యుత్ మోటార్ల ద్వారా ఎకరాలలో నారు పెంచుతున్నారు. బాండు రాసుకొని కావాల్సిన విత్తనాలు ఇక్కడ రైతులకు.. ఇస్తే 30 నుంచి 40 రోజులు నారు పెంచి.. మోపులు కట్టి వాహనంపై వేస్తారు. ఈ విధంగా చేస్తే సెంటు నారుమడికి రూ.1,200 నుంచి రూ.1,300 చొప్పున తీసుకుంటున్నారు. ఈ ఏడాది కూడా నియోజకవర్గంలోని బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాలతోపాటు చెరుకుపల్లి మండలంలో విస్తారంగా నారు మడులు వేశారు. ధరివాదకొత్తపాలెం, కొండుభొట్లపాలెం, నందిరాజుతోట, నల్లమోతువారిపాలెం, పాతనందాయపాలెం, కొత్తనందాయపాలెం, ఎం.వి.రాజుపాలెం, ఏట్రవారిపాలెం, యాజలి, దిండువారిపాలెం, రెడ్డిపాలెం, చందోలు, రాంభొట్లపాలెం, చెరుకుపల్లి తదితర ప్రాంతాలలో ఇప్పటికే నారు పోశారు. ఎక్కువ మంది బీపీటీ రకాల నారు పోయగా కొంతమంది రైతులు ఎంటీయూ 1262, 1224, 1282 రకాల నారు కూడా పెంచుతున్నారు. కాల్వలకు నీరు వచ్చిన వెంటనే ఆయా ప్రాంతాల రైతులు వచ్చి ఇక్కడ నారు కొనుగోలు చేయడం లేదా బాండు ద్వారా పెంచుతున్న రైతులు తీసుకెళ్లడం జరుగుతుంది.

సహాయకులకు జీజీహెచ్ గేట్ పాస్ తప్పనిసరి



మాట్లాడుతున్న డాక్టర్ రమణ యశస్వి

గుంటూరు మెడికల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సమగ్రాస్పత్రి(జీజీహెచ్)లో ఏర్పాటు చేసిన నూతన సెక్యూరిటీ పాలసీ ప్రకారం రోగుల పక్కన ఉండే సహాయకులకు తప్పనిసరిగా గేట్ పాస్ ఉండాలని సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. శుక్రవారం రోగులు, వారి సహాయకులతో నిర్వహించిన 'మీ కోసం ' కార్యక్రమంలో ఆసుపత్రిలో నియమనిబంధనలను ఆయన వివరించారు. ఆసుపత్రి పరిసరాల్లో దొంగతనాల నివారణకు, అపరిచితుల సంచారం కట్టడి చేసేందుకు రోగుల సహాయకులకు గేట్ పాస్ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ పాస్ ఉంటేనే వారిని వార్డులోకి అనుమతిస్తామని స్పష్టం చేశారు. సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ బీవీ రావు మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో ఎక్కువ మంది గడ్డి మందు, పాము కాటుతో చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రికి వస్తున్నట్లు తెలిపారు. ఈ విషయంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జాగృతి సేవ సంస్థ ప్రతినిధి నాగరాజకుమారి పేద రోగులకు ఉచిత బియ్యం పంపిణీ చేశారు.

సత్తెనపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో అస్తవ్యస్తంగా తయారైన అంగన్‌వాడీ కేంద్రాలను గాడిలో పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందిస్తున్నారు. కేంద్రాలకు రాలేని వారి ఇళ్లకు వెళ్లి ఇస్తున్నారు. ఈ క్రమంలో సరుకులు పక్కదారి పడుతున్నాయని, లబ్ధిదారులకు సరిగా అందడం లేదనే విమర్శలు ఉన్నాయి. వీటికి అడ్డుకట్ట వేసేందుకు కూటమి ప్రభుత్వం నూతన సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ముఖ ఆధారిత హాజరు విధానం తీసుకొచ్చింది. సరుకులు అందించే సమ యంలో ఫోన్ ద్వారా ముఖ హాజరు, ఓటీపీ నమోదు చేసే విధానం అమలు చేస్తోంది.

సవాళ్లను అధిగమిస్తేనే

వైసీపీ ప్రభుత్వం 2019లో అంగన్‌వాడీలకు ఫోన్‌లు అందించింది. అవి ఎక్కువ శాతం సక్రమంగా పని చేయడం లేదు. నెలకు సమకూరుస్తున్న 2 జీబీ డేటా సరిపోవడం లేదు. కొన్ని ప్రాంతాల్లో నెట్ సరిగా అందక.. సరుకులు అందించడం సవాల్‌గా మారింది. కేంద్రాలకు వచ్చే లబ్ధిదారుల ఫోన్‌లలో బ్యాలెన్స్ లేకపోవడంతో ఓటీపీ సమస్యలు తలెత్తుతున్నాయి. గంటల తరబడి సమయం వృథా కావడంతో.. పిల్లలకు పాఠాలు చెప్పే సమయం ఉండటం లేదు. సమస్యలు అధిగమించేలా అధికారులు చొరవ చూపాలని అంగన్ వాడీ కార్యకర్తలు కోరుతున్నారు.



ప్రతి ఒక్కరికీ పోషణ అందేలా..

- ఐసీడీఎస్‌లో లబ్ధిదారుల ముఖ ఆధారిత హాజరు
- సరుకులు పక్కదారి పట్టకుండా చర్యలు
- పోషణ్ ట్రాక్ యాప్‌లో వివరాల నమోదు

పోషణ ట్రాకింగ్..

అంగన్ వాడీ కేంద్రాల్లో ముఖ ఆధారిత హాజరు విధానం పక్కాగా అమలు చేస్తున్నారు. ఈ మేరకు కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. కేంద్రాల్లో మూడు నుంచి ఆరు సంవత్సరాల చిన్నారులు ఎంత మంది ఆహారం తీసుకుంటున్నారో తప్పనిసరిగా నమోదు చేయాలి. వీరి కోసం పోషణ్ ట్రాక్ యాప్ అందుబాటులోకి తీసుకు వచ్చారు.

అంగన్‌వాడీ మెనూ ఇలా..

గర్భిణులకు, బాలింతలకు అంగన్‌వాడీల్లో నెలకు బియ్యం మూడు కేజీలు, కంది పప్పు కేజీ, అర కిలో నూనె, 25 కోడి గుడ్లు, ఐదు లీటర్ల పాలుతో పాటు కిట్ ఇస్తారు. ఈ కిట్‌లో రెండు కేజీల రాగి పిండి, కేజీ అటుకులు, 250 గ్రాముల చిక్కీలు, కర్జూరం, బెల్లం ఇస్తున్నారు. ఆరు నెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారులకు రెండున్నర కేజీల బాలామృతం ప్యాకెట్, రెండున్నర లీటర్ల పాలు, 20 కోడిగుడ్లు అందిస్తారు. మూడేళ్ల నుంచి ఆరు సంవత్సరాల లోపు చిన్నారులకు రోజూ ఒక గుడ్డు, వంద మిల్లీలీటర్ల పాలు అందిస్తున్నారు.

స్మార్ట్‌మీటర్లపై రేపు అవగాహన సదస్సు

తాడేపల్లి టౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 13న ఆదివారం విజయవాడలోని దాసరి భవన్‌లో స్మార్ట్ మీటర్లు వద్దు.. ట్రూ అప్ చార్జీల రద్దు పేరుతో ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల రాష్ట్ర సదస్సు జరుగుతుందని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి తెలిపారు. తాడేపల్లి అమరారెడ్డి భవన్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో మాల్యాద్రి మాట్లాడుతూ రాష్ట్రంలో అదాని కంపెనీ విద్యుత్ స్మార్ట్ మీటర్ల పేరుతో విద్యుత్ చార్జీల బాదుడు మొదలెట్టిందన్నారు. స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలకు జరిగే నష్టాల గురించి వారిని చైతన్య వంతులు చేయాలన్నారు. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో కాలనీ వాసులు, రైతులు స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకిస్తున్నారన్నారు. స్మార్ట్ మీటర్ల చార్జీలు వినియోగదారుడు భరించలేరన్నారు. ఇప్పటికే విద్యుత్ ట్రూ అప్ చార్జీలతో వినియోగదారుడు అల్లాడుతున్నాడని పేర్కొన్నారు. ఈ సదస్సులో స్మార్ట్‌మీటర్లపై కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని తెలిపారు. వామపక్ష ప్రజా సంఘ నేతలు పాల్గొంటున్నారని చెప్పారు. వెంకటేశ్వర్లు, నవీన్, బర్నబాస్, విజయభాస్కరరెడ్డి, దుర్గారావు, బాబూరావు పాల్గొన్నారు.

పల్నాటి పౌరుషం ఉట్టిపడేలా..

అనుగురాజు విగ్రహం రూపకల్పన

తెనాలి అర్బన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : పల్నాడును పాలించిన అనుగురాజు విగ్రహాన్ని తెనాలి శిల్పులు రూపొందించారు. ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి సూచనల మేరకు అనుగురాజు విగ్రహాన్ని 700 కిలోల కాంస్యంతో సూర్య శిల్ప శాలలో తయారు చేశారు.



అనుగురాజు విగ్రహంతో శిల్పులు

పిడుగురాళ్లలో ఈ విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు విగ్రహ కమిటీ సభ్యులు తెలిపారు. శిల్పశాల నుంచి విగ్రహాన్ని పిడుగురాళ్లకు తరలించారు. శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర, కమిటీ సభ్యులు జనార్ధనరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ అడ్మిషన్లను వెంటనే ప్రారంభించాలి



ఉన్నత విద్యామండలి చైర్మన్ మధుమూర్తికి వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నేతలు

మంగళగిరి సిటీ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కె.భాస్కర్ కోరారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శుక్రవారం మంగళగిరిలో ఉన్నత విద్యా మండలి చైర్మన్ మధుమూర్తిని కలిసి విద్యా రంగ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. భాస్కర్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా డిగ్రీ అడ్మిషన్లపై ఎలాంటి ప్రకటన చేయకపోవడం సరైన విధానం కాదన్నారు. దీన్ని అవకాశంగా తీసుకుని ప్రైవేటు కళాశాలలు ముందస్తుగా విద్యార్థులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నాయని, తద్వారా ఎక్కువ శాతం మంది విద్యార్థులు ప్రైవేటు కళాశాలల్లో చేరే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అడ్మిషన్లలో జాప్యం చోటుచేసుకోవడంతో ఫలితాలు ఆలస్యంగా రావడం, ఏపీపీజీ సెట్, ఐసెట్ వంటి ఉమ్మడి పరీక్షలు వాయిదా పడడం, రాష్ట్రీయ, కేంద్రీయ విద్యాలయాల్లో చదవాలనుకునే విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గత ప్రభుత్వం సింగిల్ మేజర్ విధానాన్ని తీసుకువస్తే కూటమి ప్రభుత్వం డబుల్ మేజర్ విధానాన్ని తీసుకువస్తున్నట్లు ప్రకటించిందని, దీనిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిగ్రీ అడ్మిషన్లకు తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలని, ఆన్‌లైన్ అడ్మిషన్ల విధానాన్ని రద్దు చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న డిగ్రీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి ఐ.రాజేష్, ఉపాధ్యక్షుడు ఎన్.మహర్షి, నేతలు రమణ, శంకర్, ప్రసాద్, అస్లాం, తేజ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శాకాంబరి వేడుకలు


కూరగాయల అలంకారంలో అమ్మవారు

గిద్దలూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శుక్రవారం సాయంత్రం శాకాంబరి వేడుకలు వైభవంగా జరిగాయి. అమ్మవారి మూలవిరాట్‌ను, ఉత్సవ విగ్రహాన్ని, ఆలయం మొత్తాన్ని కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో అలంకరించారు. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు శాకాంబరి వేడుకల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. దేవస్థాన కమిటీ అధ్యక్షులు వాడకట్టు రంగ సత్యనారాయణ, కార్యదర్శి తుమ్మలపెంట సత్యనారాయణ, కమిటీ ప్రతినిధులు, ఆర్య వైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

కొమరోలులో...

కొమరోలు, జూలై 11(ఆంధ్రజ్యోతి): స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో శక్రవారం శాకాంబరీ దేవి అలంకరణలో ప్రజలకు దర్శనమిచ్చారు. అమ్మవారికి పలురకాల కూరగాయలు, పండ్లతో అందంగా అలంకరించారు. సాయంత్రం ప్రజలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆర్‌ఎస్సైగా తిరుపతి స్వామికి ఉద్యోగోన్నతి

ఒంగోలు క్రైం, జూలై 11(ఆంధ్రజ్యోతి) : ఆర్మ్‌డ్ రిజర్వుడు విభాగంలో ఏఆర్‌ఎస్సైగా పనిచేస్తున్న వి.తిరుపతిస్వామికి ఉద్యోగోన్నతి కల్పిస్తూ గుంటూరు రేంజ్ ఐజీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. ఈ మేరకు తిరుపతిస్వామి మర్యాద పూర్వకంగా శుక్రవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఎస్పీని కలిసి పూల బొకే అందజేశారు.

బైకు ఢీకొని వృద్ధుడి మృతి


వెంకటేశ్వర్లు

కలిగిరి, జూలై 11(ఆంధ్రజ్యోతి): కలిగిరి-సంగం మార్గంలో వెలగపాడు గ్రామ సమీపంలో బైకు ఢీకొనడంతో వెంకటేశ్వర్లు(75) మృతి చెందాడు. వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా దర్శి సమీపంలోని కుడిచేడు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు వెలగపాడు వద్ద ఉన్న ఓ వెంచర్‌లో పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి వెంచర్‌లో నుంచి వెలుపలకు వచ్చి రోడ్డు మార్జిన్‌లో నడుచుకొంటూ వెళుతుండగా పాతనాపురం నుంచి కలిగిరి వైపు వస్తున్న బైకు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వృద్ధుడుని చికిత్స నిమిత్తం 108 వాహనంలో కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందాడని మృతుడి బంధువులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మంద కృష్ణమాదిగ సన్మాన సభను జయప్రదం చేద్దాం

అద్దంకిటౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి సీఎస్‌ఆర్ కల్యాణ మండపంలో శనివారం ఎస్సీ, ఎస్టీ, గజిటెడ్ ఉద్యోగులు రాష్ట్ర వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మంద కృష్ణ మాదిగకు సన్మాన సభ జరుగుతుందని ఎంఈఎఫ్ అద్దంకి నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు అనపర్తి రమేష్‌బాబు, గంగవరపు సిద్దు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున నియోజకవర్గ పరిధిలోని ఎంఆర్‌పీఎస్, మాదిగ ఉద్యోగులు అందరూ పాల్గొని సన్మాన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

నేడు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఇంకొల్లు, జూలై 11,(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగవరం శ్రీ వలేటి కృష్ణయ్య ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని హైస్కూల్ చైర్మన్ వలేటి కృష్ణయ్య తెలిపారు. ఈ ఉన్నత పాఠశాల 1956లో స్థాపించగా ఇప్పటికి 70 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా అప్పటి నుంచి ఈ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు, ఎండోమెంట్ కమిషనర్ రామచంద్రమోహన్, మాజీ ఎమ్మెల్సీ ఎస్.లక్ష్మణరావు పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు.

గ్రామాలలో వీధికుక్కల స్వైరవిహారం

మార్టూరు, జూలై11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతి గ్రామంలో వీధికుక్కలబెడద అధికమయ్యిందని ప్రజానీకం వాపోతున్నారు. వీధులలో కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు వీధులలో నడచివెళ్లాలంటే భయపడుతున్నారు. ఇక ద్విచక్రవాహనదారులు వెళుతుంటే కొన్ని వీధులలో కుక్కలు వెంటబడుతున్నాయని ద్విచక్రవాహనదారులు భయపడుతున్నారు. నాలుగురోజుల క్రితం మండలంలోని కోలలపూడి గ్రామంలో ఒకే రోజు 11 మంది పిచ్చికుక్క కాటుకు గురయ్యారు. అంతేగాకుండా ద్రోణాదుల, నాగరాజుపల్లి గ్రామాలలో కుక్కల దాడికి గాయపడినవారున్నారు.మార్టూరులో నేతాజీ నగర్, రామ్‌నగర్ కూడలి వద్ద రాత్రి సమయంలో ద్విచక్రవాహనదారులు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. వలపర్ల గ్రామంలో మాంసం దుకాణాలు వద్ద కుక్కలు గుంపులు గుంపులుగా స్వైర విహారం చేస్తున్నాయి. రోడ్డుపై వెళ్లే ద్విక్రవాహనదారుల వెంట బడుతున్నాయి. గతంలో గ్రామ పంచాయతీ వారు గ్రామంలో కుక్కల బెడద ను తొలగించడానికి చర్యలు చేపట్టేవారు. అయితే ప్రస్తుతం కుక్కలను గ్రామం నుండి పంపించడానికి, వాటి నిర్మూలనకు పంచాయతీ వారు ఎలాంటి చర్యలు చేపట్టడంలేదు. దానికి తోడు జాతీయ రహదారి కావడంతో రాత్రి సమయంలో కొంత మంది వాహనాలలో కుక్కలను తీసుకువచ్చి, ఈ ప్రాంతంలో కుక్కలను వదిలివెళుతుండటంతో, మరింతగా గ్రామాలలో కుక్కలు సంచరిస్తున్నాయి. మరి ఈ నేపథ్యంలో కుక్కల సైన్యాన్ని గ్రామాల నుండి పారద్రోలడానికి పంచాయతీల ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవలసినఅవసరం ఉందని గ్రామస్తులు బావిస్తున్నారు.


మార్టూరులో వీధులలో వీధికుక్కల సంచారం

ప్రజలు బుద్ధి చెప్పినా మారని వైసీపీ నేతలు

- మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి
- ఆత్మీయ సమావేశం పేరుతో నాయకుల అబద్ధాలాడటం సిగ్గుచేటని విమర్శ

టంగుటూరు (కొండపి), జూలై11 (ఆంధ్రజ్యోతి): ఆత్మీయ సమావేశం పేరుతో శుక్రవారం కొండపిలో వైసీపీ కార్యకర్తల సమావేశంలో నాయకులు మాట్లాడిన అసత్యాలపై రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖామంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తూర్పు నాయుడుపాలెంలోని తన కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. వైసీపీ నాయకుల అవాకులు, చెవాకులపై స్వామి నిప్పులు చెరిగారు. ప్రజలు 11 సీట్లిచ్చి బుద్ధి చెప్పినా వారికి బుద్ధి రాలేదన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో జరగని సంక్షేమం, అభివృద్ధిని ఏడాది కాలంలో సీఎం చంద్రబాబు నాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం చేసి చూపిందని స్వామి తెలిపారు. తల్లికి వందనం పథకంలో చదువుకునే పిల్లలు ఎందరున్నా వారందరికీ డబ్బులు తల్లుల ఖాతాలో వేసినా సిగ్గు లేకుండా వైసీపీ నాయకులు తాము ఇచ్చినంత మందికి కూటమి ప్రభుత్వం ఇవ్వలేదని చెప్పడం హాస్యాస్పదమన్నారు. 2029 తర్వాత వైసీపీ రాష్ట్రంలో కనుమరుగవుతుందని స్వామి అన్నారు. మూడు నియోజకవర్గాలు మారిన మాజీ మంత్రి సురేష్ గతంలో ఒకసారి చొక్కా విప్పుకుని, తర్వాత ప్రజలతో చొక్కా విప్పించుకున్నాడని స్వామి విమర్శించారు. ఓటమి పాలైన సురేష్ పిచ్చి ప్రేలాపనలు పేలుతున్నాడని స్వామి మండి పడ్డారు. జగన్ మోహన్‌రెడ్డిని మించిన నటుడు ఎవరూ లేరని, కొడికత్తి, బాబాయి గొడ్డలి లాంటి పనులు చేసి బాగా నటించాడని విమర్శించారు. వైసీపీ పాలనలో మహిళలపై జరిగినన్ని అఘాయిత్యాలు ఏరాష్ట్రంలో జరగలేదని, దళితులపై దాడులు జరుగుతుంటే సురేష్ నోరు మెదపలేదు ఎందుకు? అని స్వామి పేర్కొన్నారు. రప్పారప్పా అంటూ పిచ్చి మాటలు మాట్లాడితే వైసీపీ రాజకీయాలకి, రౌడీ మూకలకీ కొండపి నియోజకవర్గంలో స్థానం లేదన్నారు. వైసీపీ రాబోయే రోజుల్లో అధికారంలోకి రావడం కల్ల మాత్రమేనని, ఎన్ని పగటి కలలు కన్నా మళ్లీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వమేనని స్వామి పేర్కొన్నారు.


మంత్రి స్వామి

లంచమిస్తేనే రిజిస్ట్రేషన్

- లేకుంటే కొర్రీల కొరడా
- ఎనీవేర్‌తో ఎక్కడివైనా చేసేస్తారు..
- గిద్దలూరులో గత మంగళవారమే రెక్కీ

గిద్దలూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరులోని ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ కృష్ణమోహన్‌రావు అక్రమాలకు అంతులేకుండా పోతోంది. ఎనీవేర్ రిజిస్ట్రేషన్ జీవోను అడ్డం పెట్టుకుని మార్కాపురానికి చెందిన ఒక స్థలం రిజిస్ట్రేషన్‌ను ఇటీవలే గిద్దలూరులో చేసి రూ.10లక్షలకుపైగా లంచం తీసుకున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. సక్రమమైన రిజిస్ట్రేషన్ అయితే మార్కాపురంలోనే జరిగేది కదా అని, ఇంత పెద్ద మొత్తం లంచం ఇచ్చారంటే ఆ రిజిస్ట్రేషన్ చేసుకున్న స్థలంలో ఏదో ఒక లొసుగు ఉండి ఉంటుందని ఏసీబీ అధికారులు తాజాగా చేసిన తనిఖీలో గుర్తించినట్లు తెలిసింది. పట్టణంలోని పలు స్థలాలు, బిల్డింగ్‌ల రిజిస్ట్రేషన్‌లో కూడా భారీ ఎత్తున డబ్బు గుంజినట్లు తెలిసింది. గిద్దలూరు పట్టణంలోని దాదాపు అన్ని ప్రాంతాలలో పాత ఇళ్ళు, స్థలాలకు రిజిస్ట్రేషన్లు ఉన్నప్పటికీ అప్పట్లో సర్వే నెంబరు వేసేవారు కాదు. ప్రస్తుతం సర్వే నెంబరు లేనిది రిజిస్ట్రేషన్ జరగడం లేదు. దానికితోడు చాలా మందికి వారి స్థలాలు, ఇళ్లు సొంతమే అయినప్పటికీ డాక్యుమెంట్లు ఉండవు. వీటిని అడ్డం పెట్టుకుని వీఆర్వోలతో పొజిషన్ సర్టిఫికేట్లు తీసుకుని లక్షలు ఇస్తే తప్ప రిజిస్ట్రేషన్లు జరుపని పరిస్థితి కనిపిస్తోంది.

ఇష్టారీతిన బరితెగింపు

ఎవరైనా లంచం తీసుకునేటపుడు గుట్టుచప్పుడు కాకుండా, మూడో కంటికి తెలియకుండా వీలుంటే మధ్యవర్తి సహాయంతో ప్రభుత్వ కార్యాలయంలో కాకుండా బయట ఎక్కడో తీసుకుంటారు. కానీ ఈ ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ క్రిష్ణమోహన్‌రావు మాత్రం డాక్యుమెంట్ రైటర్లు వద్దు, మధ్యవర్తి వద్దు, నేరుగా మీరే రండి, లంచం మాట్లాడుకోండి, ఇచ్చిపోండి అంటూ కార్యాలయంలో బహిరంగంగానే చెబుతుంటారు. కార్యాలయం వెనకకు వెళ్లి అక్కడ ఉన్న చెట్టు వద్ద మూత్రవిసర్జన చేసి సిగరెట్ కాలుస్తూ అక్కడే లంచాలు అందరూ చూస్తుండగానే తీసుకుని జేబులో పెట్టుకుని వెళుతుండడం విశేషం. లక్షలాది రూపాయల లంచాలకు ఆ చెట్టే సాక్ష్యంగా ఉన్నట్లు గుసగుసలు ఆడుకుంటున్నారు. ఇంకా బరితెగించిన విషయమేమంటే ఎవరైనా లంచాలను డబ్బు రూపంలోనే తీసుకుంటారు. కానీ ఈయన మాత్రం బ్యాంక్ అకౌంట్‌లో వేసినా, ఫోన్‌పే చేసినా ఒకే అని చెప్పడం ఏసీబీ అధికారులను సైతం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఏసీబీ రైడ్‌లో క్రిష్ణమోహన్‌రావు రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిన నేపథ్యంలో అతని బ్యాంక్ అకౌంట్, ఫోన్‌పేలను పరిశీలించగా అందులో ఉన్న ఎంట్రీలు చూసి నివ్వెర పోయినట్లు తెలిసింది. ఐదారు మంది డాక్యుమెంట్ రైటర్ల నుంచి లంచాలు నగదు రూపంలో కాకుండా ఎక్కువ భాగం ఫోన్‌పేల ద్వారా, అకౌంట్ ద్వారా సబ్ రిజిస్ట్రార్ వేసుకున్నట్లు గుర్తించి ఏసీబీ అధికారులే నోరెల్లబెట్టారు. గిద్దలూరులో పని చేసిన ఈ 8 నెలల కాలంలో ఇలా ఫోన్‌పేల ద్వారా జరిపిన ఎంట్రీలు సుమారు 60 పేజీలు ఉన్నాయంటే ఎంత బరితెగింపో ఇట్టే అర్థమవుతుంది. రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే అదే రోజు సాయంత్రం 5 గంటలలోగా లంచం డబ్బులు ఇవ్వాల్సిందేనంటూ డాక్యుమెంట్ రైటర్లపై ఒత్తిడి తెచ్చి డబ్బు తీసుకునేవాడని తెలిసింది. పార్టీ అకౌంట్‌లో వేశారు, డ్రా చేసి మరుసటి రోజు ఇస్తామంటే కూడా అవసరం లేదు, నా అకౌంట్‌లోకి కొట్టండి అంటూ సాయంత్రం పని ముగించుకుని ఇంటికి వెళ్ళేలోగా లంచం సొమ్ము తీసుకునే వెళ్ళేవాడని తెలుస్తోంది.

మ్యారేజ్ సర్టిఫికెట్‌కు రూ.5వేలు

ప్రస్తుత రోజుల్లో మారిన నిబంధనల ప్రకారం మ్యారేజ్ సర్టిఫికెట్ తప్పనిసరి అయింది. మ్యారేజ్ సర్టిఫికెట్ కోసం వస్తే ధనిక, పేద తేడా లేకుండా 5వేల రూపాయలు లంచం ఇస్తే తప్ప సర్టిఫికెట్ జారీ చేయని పరిస్థితి నెలకొంది. పాత రోజుల్లో మ్యారేజ్ సర్టిఫికెట్ రిజిస్ట్రేషన్‌కు వెయ్యి రూపాయల లంచం తీసుకునేవారు. కానీ ఈయన మాత్రం పెళ్లిళ్లకు లక్షలు ఖర్చు పెడతారు, లక్షలు కట్నంగా ఇచ్చుకుంటారు, మాకు 5వేలు ఇవ్వరా అంటూ ముక్కుపిండి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఇదేమని ప్రశ్నిస్తే తల్లి, తండ్రి, అత్త, మామ, పూజారులు, సాక్షులు అందరిని తీసుకురా అప్పుడు చూద్దామంటూ చెబుతుండడంతో చేసేది ఏమీ లేక అడిగినంత ఇస్తున్నట్లు తెలిసింది.


గిద్దలూరులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

మంగళవారమే రెక్కీ

తల్లి ఆస్తిని తన పేరు మీద గిఫ్ట్‌డీడ్ చేసుకునేందుకు కార్పెంటర్‌గా పని చేస్తున్న ఖాదర్ బాషా సబ్ రిజిస్ట్రార్‌ను సంప్రదించారు. రూ.50వేలు లంచం డిమాండ్ చేయగా రూ.35వేలకు బేరం కుదిరింది. తన ఆస్తిని తనకు రిజిస్ట్రేషన్ చేసేందుకు ఇంత మొత్తం లంచం ఇవ్వడం ఇష్టంలేని ఖాదర్ బాషా ఏసీబీ అధికారులను సంప్రదించాడు. అన్ని ఆధారాలు సేకరించుకుని నిజమే అని నిర్ధారణ చేసుకున్న ఏసీబీ అధికారులు గత మంగళవారమే గిద్దలూరు చేరుకున్నట్లు తెలిసింది. అయితే ఈ విషయం తెలిసి ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ క్రిష్ణమోహన్‌రావు మంగళవారం ఆఫీసుకు కూడా రాకుండా సెలవుపై వెళ్లిపోయారు. దాంతో చేసేదేమీ లేక ఏసీబీ అధికారులు వెళ్లిపోయినట్లు తెలిసింది. తిరిగి గురువారం డ్యూటీలో జాయిన్ కాగా హుటాహుటిన కర్నూలు, ఒంగోలు నుంచి ఏసీబీ అధికారులు గిద్దలూరు చేరుకుని వల పన్ని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవడం గమనార్హం.

గంగమ్మ తల్లి కొలుపులు ప్రారంభం

చినగంజాం, జూలై 11(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడవకుదురు గ్రామంలో వేంచేసిన గంగమ్మ తల్లి కొలుపుల పూజలు శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి యంపరాల హైమారావు అమ్మవారిని విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. తదనంతరం గంగమ్మ తల్లి ఉత్సవ విగ్రహాన్ని మేళతాళాలు, కనకతప్పెట్లుతో ఊరేగింపుగా మోటుపల్లి సముద్ర తీరానికి తీసుకొని వెళ్లారు. ఆలయ పూజారి, యాదవ పెద్దలు కొండెపు వెంకటేశ్వర్లు, నక్కల పెదముత్తయ్యల ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, సముద్ర స్నానం కార్యక్రమం నిర్వహించారు. అక్కడ నుండి ఊరేగింపుగా గ్రామంలోని శివాలయం సెంటర్‌లో ఏర్పాటు చేసిన పూజా మందిరానికి చేర్చి పూజలు జరిపారు. శనివారం రాత్రి అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం జరుపుతున్నట్లు తెలిపారు.

ఆటోని ఢీ కొట్టిన గేదె

చినగంజాం, జూలై 11(ఆంధ్రజ్యోతి) : ఆటోని గేదె ఢీ కొట్టడంతో ఆటోడ్రైవర్‌కు గాయాలైన ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకొంది. ఈ ఘటన కడవకుదురు గ్రామ పంచాయతీ పరిధిలోని పాతపాడు గ్రామ సమీపంలోని ఆర్‌అండ్‌బీ రహదారిపై జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం కడవకుదురు గ్రామానికి చెందిన తమ్మన వెంకటసుబ్బారావు తన ఆటోలో పదిమంది మహిళా భజన బృందం సభ్యులతో మన్నంవారిపాలెం గ్రామంలోని పోలేరమ్మ ఆలయంలో భజన చేసేందుకు బయలుదేరారు. గ్రామం నుండి బయలుదేరి మున్నంవారిపాలెం గ్రామం వెళ్తుండగా పాతపాడు గ్రామం వద్ద ఆర్ అండ్‌బీ రహదారిపై గేదె ఎదదురుగా వచ్చి ఆటోని ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆటో యాజమాని, డ్రైవర్ అయిన వెంకటసుబ్బారావుకు గాయమైంది. క్షతగాత్రుని చికిత్స నిమిత్తం స్థానిక వైద్యశాలకు తరలించారు. ఆటోలో ఉన్న మహిళలకు ఎలాంటి ప్రమాదం లేకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఘటనా స్థలాన్ని చినగంజాం పోలీసులు పరిశీలించారు.

హెపటైటీస్‌పై అవగాహన కలిగిఉండాలి

నాగులుప్పలపాడు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): హెపటైటీస్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని హెల్ప్ స్వచ్ఛంధ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బీవీ.సాగర్ సూచించారు. శుక్రవారం బి.నిడమానూరు గ్రామంలో ఆ సంస్థ ఆధ్వర్యంలో హైరిస్క్ వ్యక్తులను గుర్తించి వారికి హెపటైటీస్ బి, సి నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు. వ్యాధిపై అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజరు కోటేశ్వరరావు, ఎన్ఎం రాధమ్మ, మల్లీశ్వరి పాల్గొన్నారు.

వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మేదరమెట్ల, జూలై 11(ఆంధ్రజ్యోతి): ప్రపంచ జనాభ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, పెయింటింగ్ పోటీలలో రావినూతల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. లింగసమానత్వం, గౌరవం అనే అంశంపై జరిగిన వ్యాసరచన, మాదకద్రవ్యాల వినియోగం-నివారణ అనే అంశంపై జరిగిన పెయింటింగ్ పోటీలలో పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న చీరాల లక్ష్మి, మేడిద వర్షలు ప్రథమ స్థానం సాధించారు. వీరికి ఫైనంపాడు జిల్లా డైట్ కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో బహుతులను కళాశాల ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు చేతుల మీదుగా అందుకున్నారు. తల్లికివందనం సందర్భంగా నియోజకవర్గ స్థాయిలో పిల్లల చదువులో తల్లిపాత్ర అనే అంశంపై జరిగిన వ్యాసరచన పోటీలలో 9వ తరగతి విద్యార్థి గొట్టిపాటి శశంక్ తృతీయ స్థానం సాధించారు. పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులను పాఠశాల హెచ్ఎం రాఘవరెడ్డి, పాఠశాల కమిటి చైర్మన్, ఉపాధ్యాయులు, సిబ్బంది, గ్రామ పెద్దలు అభినందించారు.


ప్రశంసపత్రాలతో విద్యార్థులు

కుటుంబ నియంత్రణ, బాల్య వివాహాలపై అవగాహన

స్వర్ణ/పర్చూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శుక్రవారం కారంచేడు మండలం స్వర్ణ గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో కుటుంబ నియంత్రణ, బాల్యవివాహాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ శాలిని బాల్య వివాహాల వల్ల కలిగే అనార్థాలను వివరించారు. అనంతరం గ్రామంలోని ప్రధాన కూడలిలో మానవహారం నిర్వహించారు. వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.


వైద్యసిబ్బంది మానవహారం

సులభ్‌కాంప్లెక్స్ ఏర్పాటుకు భూమి పూజ

ఇంకొల్లు, జూలై 11,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థూపం కూడలి సమీపంలో సులభ కాంప్లెక్స్ ఏర్పాటుకు రోటరీ 3150 జిల్లా గవర్నర్ ఎస్.వీ.రామ్‌ప్రసాద్ శుక్రవారం భూమి పూజ చేశారు. ప్రజల సౌకర్యార్థం నిర్మించనున్న సులభ్‌కాంప్లెక్సు పనులు త్వరలో ప్రారంభించి వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షులు బలగం కోటేశ్వరరావు, కార్యదర్శి రాఘవరెడ్డి, క్లబ్ సభ్యులు,పంచాయితీ సెక్రటరీ అడ్డగడ్డ వెంకటేశ్వర్లు,హుసేన్‌సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాడు ఏఎంసీ చైర్మన్‌గా రాజేశ్వరి

అవీఇవీ

- 20మంది కమిటీతో ప్రభుత్వం ఉత్తర్వులు

చీమకుర్తి, జూలై11(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు వ్యవసాయ కమిటీ చైర్మన్‌గా చీమకుర్తికి చెందిన ప్రముఖ టీడీపీ నాయకుడు సతీమణి మన్నం రాజేశ్వరిని నియమిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా చైర్మన్ రాజేశ్వరి, ఎమ్మెల్యే బీఎన్. విజయ్‌కుమార్‌కి ధన్యవాదాలు తెలిపారు. నూతనంగా 20మంది సభ్యులతో కూడిన ఎంపిక జాబితాను ఉన్నతాధికారుల విడుదల చేశారు. వీరందరూ త్వరలోనే ప్రమాణ స్వీకారం చేయటానికి సన్నాహాలు చేస్తున్నారు. కాగా రాజేశ్వరి ఎంపిక పట్ల టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.


ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందచేస్తున్న ప్రసాద్, రాజేశ్వరి

ఫ్యాక్షన్ గ్రామంపై ప్రత్యేక నిఘా : ఎస్సై

- రాజకీయ పార్టీ ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన ఒక వ్యక్తిపై బైండోవర్

బల్లికురవ. జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ఫ్యాక్షన్ గ్రామమైన వేమవరంపై పోలీసు శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసిందని శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రజలు కూడా సహకరించాలని ఎస్ఐ వై.నాగరాజు కోరారు. వేమవరంలో గత ఏనిమిదేళ్ల నుండి పికెట్ నిర్వహిస్తున్నారు. పోలీస్ పికెట్‌ను ఎస్ఐ తనిఖీ చేశారు. ఈ సందర్భం గా అయన మాట్లాడుతు కొత్త వ్యక్తులు ఎవరైన గ్రామంలోనికి వచ్చిన వారి వివరాలను సేకరించాలని సిబ్బందికి సూచించారు. వేమవరం గ్రామంలో మూడావత్ హరికృష్ణనాయక్ అనే వ్యక్తి రాజకీయ పార్టీకి చెందిన ఫ్లెక్సీని ఏర్పాటు చేయడంతో ముందస్తు జాగ్రత్తగా ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా ఆయనపై తహసీల్దార్ సమక్షంలో బైండోవర్ కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. గ్రామాలలో గోడవలు సృష్టించేందుకు ఎవరైన చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.


పికెట్‌ను పరిశీలిస్తున్న ఎస్సై

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

యద్దనపూడి,(మార్టూరు)జూలై11(ఆంధ్రజ్యోతి):ద్విచక్రవాహనంపడిపోవడంతో,బైక్ పైన ఉన్న పెట్రోలు క్యాన్ నుండి మంటలు చెలరేగి , తీవ్రంగా గాయపడి గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చేబ్రోలు సుబ్బారావు (48) శుక్రవారం మృతి చెందినట్లు ఎస్ఐ టి.రత్నకుమారి తెలిపారు. ఎస్సై కథనం మేరకు యద్దనపూడి మండలంలోని సూరవరపుపల్లి గ్రామానికి చెందిన సుబ్బారావు ఈ నెల 3న ద్విచక్రవాహనంపై జాతీయరహదారి పక్కన ఉన్న భారత్‌పెట్రోలు బంకులో 4 లీటర్లు పెట్రోలును ఒక క్యాన్‌లో తీసుకొని ఇంటికి వస్తున్నారు. ఈ సమయంలో మార్గమధ్యలో ద్విచక్రవాహనం పడిపోయింది. దీంతో పెట్రోలు క్యాన్ నుంచి పెట్రోలు రోడ్డుపై పడ్డాయి. తరువాత మంటలు వ్యాపించాయి. దీంతో సుబ్బారావుకు తీవ్రగాయాలయ్యాయి. ఆయనను బంధువులు చిలకలూరిపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి, అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. సుబ్బారావుకు భార్య కుమారుడు ఉన్నారు.

15 నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు

అద్దంకిటౌన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): గ్రామాలల్లో ఈ నెల 15వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బత్తిన సింగయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15న మోదేపల్లి, జార్లపాలెం, విప్పర్లవారిపాలెం గ్రామాలలో, 16న పేరాయపాలెం, వేలమూరిపాడు, వెంకటాపురం, 17న కొంగపాడు, కలవకూరు, ధర్మవరం, 18న మణికేశ్వరం, చక్రాయపాలెం, శంఖవరప్పాడు గ్రామాలల్లో క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. 22న బొమ్మనంపాడు, శింగరకొండపాలెం, కోటికలపూడి, 23న మైలవరం, గోపాలపురం, కుంకుపాడు, 24న ఉప్పలపాడు, నాగులపాడు, తిమ్మయపాలెం, 25న వెంపరాల, గోవాడ, రామాయపాలెం గ్రామాలల్లో జరుగుతాయని ఎంపీడీవో తెలిపారు.

ఈ నెల 17 నుంచి పీ4 గ్రామసభలు

మండలంలోని గ్రామాలల్లో ఈ నెల 17వ తేదీ నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు పీ4 గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సింగయ్య తెలిపారు. 21వ తేదీ నుంచి ఆగస్టు 6 వరకు నీడ్ టెస్ట్ సర్వే, గ్రామ సభలలో గుర్తించిన కొత్త కుటుంబాల సర్వే ఆ గస్టు 7 నుండి 10వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

రేపటి నుంచి నిరవధిక సమ్మె


నిరసన తెలియజేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

అద్దంకిటౌన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కారించాలని ఈ నెల 13వ తేదీ నుండి జరిగే నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం స్థానిక బంగ్లారోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆదాం, సీఐటీయూ నాయకులు తోట వెంకటేశ్వర్లు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు జాన్, సామ్యూల్, కోశాధికారి మారుతి, జాషువా, మార్కు తదితరులు పాల్గొన్నారు.

రాజుగారిపాలెంలో ఫ్లెక్సీ రగడ

మార్టూరు, జూలై11(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుగారిపాలెం గ్రామంలో టీడీపీకి చెందిన ఫ్లెక్సీని వైసీపీకి చెందిన వ్యక్తి చించడంపై రెండు రోజులు నుంచి గ్రామంలో చర్చనీయాంశమయ్యింది. బుధవారం రాత్రి గ్రామంలో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. అందుకు సంబంధించి ఏలూరికి స్వాగతం పలుకుతూ గ్రామ నాయకులు చింతలపూడి శ్రీనివాసరావు పార్టీ కార్యకర్తలతో కలిసి ప్రధానవీధుల ప్రక్కన ఫ్లెక్సీలను ఏర్పాటుచేయించారు. ఈ ఫ్లెక్సీలలో ఎమ్మెల్యే ఏలూరి తోపాటు గ్రామంలోని పార్టీకి చెందిన ప్రధాన నాయకుల ఫోటోలతో పాటు శ్రీనివాసరావు కూడా తన ఫోటోను వేయించగా బుధవారం మధ్యాహ్నం సమయంలో గ్రామంలోని వైసీపీకి చెందిన ప్రజాప్రతినిధి తమ్ముడు ఫ్లెక్సీలో చింతలపూడి శ్రీనివాసరావు ఫోటోను చించివేశారు. అయినప్పటికీ, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కార్యక్రమాన్ని ప్రశాంతంగా ముగించారు. తర్వాత ఈ విషయంపై గ్రామంలో టీడీపీ, వైసీపీలకు చెందిన వ్యక్తుల మధ్య చర్చనీయాంశమైంది. తర్వాత శ్రీనివాసరావు ఈ విషయమై మార్టూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ ఎం.శేషగిరిరావు రెండు పార్టీలకు చెందిన నాయకులతో మాట్లాతున్నట్లు తెలిసింది.

అవీ..ఇవీ..

ప్రాంతీయ వైద్యశాలలో సిబ్బంది నిర్లక్ష్యం

● ఆయమ్మలకు పనిచెప్పి కాలక్షేపం చేస్తున్న వైద్యులు

● కాన్పుల వార్డులో ఆరోగ్య సిబ్బంది నిర్లక్ష్యం



మహిళ చేతి క్యానులా తొలగిస్తున్న హాస్పిటల్ ఆయమ్మ

చీరాల, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : చీరాల ప్రాంతీయ వైద్యశాలలోని బాలింతల వార్డులో ఆయమ్మలే వైద్యసేవలు అందిస్తున్నారు. సాధారణంగా నర్సులు వీరికి వైద్యసహాయకులుగా ఉండాలి. చేతి నరానికి క్యానులా ఏర్పాటు ఇతర డ్రసింగ్ పనులు నర్సులే చేయాలి. అయితే వారు ఆ పని నుంచి తప్పుకొని ఆయమ్మలతో పనిచేయిస్తున్నారు. సాధారణంగా ఒకవ్యక్తి అనారోగ్యంతో ఉన్నప్పుడు అతనికి తగు జాగ్రత్తలతో వైద్యం అందించడం చాలా అవసరం. ఇక బాలింతలకైతే మరి ముఖ్యంగా అత్యంత జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. ఏమాత్రం సమస్య ఏర్పడినా తల్లీబిడ్డ ఇద్దరికి సమస్యలు ఏర్పడే అవకాశం ఉంటుంది. కాబట్టి బాలింతల వార్డుల్లో సుశిక్షితులైన నర్సులే వైద్యం అందించాలి. అయితే ఇక్కడ మాత్రం ఆయమ్మలతో వారు వైద్యం అందిస్తూ వీరు కాలక్షేపం చేస్తున్నారు. ఈక్రమంలో వైద్యాధికారులు చర్యలు చేపట్టకుంటే సమస్యలు తలెత్తే అవకాశం లేకపోలేదు.

బాధ్యతాయుతంగా బోధన ఉండాలి

● ఉపాధ్యాయులకు డిప్యూటీ డీఈవో గంగాధర్ సూచన



రాతపుస్తకాలను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో గంగాధర్

చినగంజాం, జూలై 11(ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా బోధనపై దృష్టి సారించాలని చీరాల డిప్యూటీ డీఈవో డి.గంగాధర్ అన్నారు. మండలంలోని చినగంజాం, పెదపల్లెపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను శుక్రవారం ఆయన సందర్శించారు. చినగంజాం జడ్పీ పాఠశాలలో తరగతి గదులను, విద్యార్థుల రాత పుస్తకాలను, పెదపల్లెపాలెం జడ్పీ పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో జరిగిన సమావేశంలో డిప్యూటీ డీఈవో మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా రాయడం, చదవడంపై అసక్తి కలిగేలా చేయాలని సూచించారు. వారి విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం 4గంటల నుండి 5 గంటల వరక ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. తరగతి గదిలో చదవులో వెనుక బడిన విద్యార్థులను గుర్తించి, వారిపై ప్రత్యేకశ్రద్ధ పెట్టాలన్నారు. మధ్యాహ్న భోజనం రుచి, శుచిగా ఉండేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో ఎంఈవో అజయ్‌బాబు, చినగంజాం, పెదపల్లెపాలెం జడ్పీ పాఠశాలల హెచ్‌ఎంలు కే.శ్రీనివాసరెడ్డి, ఎల్.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి



బీఎల్‌వోల శిక్షణలో మాట్లాడుతున్న విజయజ్యోతి

బల్లికురవ. జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని నియోజకవర్గ ఎన్నికల అధికారిణి విజయజ్యోతి కుమారి పేర్కొన్నారు. శనివారం బల్లికురవలో అన్ని గ్రామాల బూత్ లెవల్ అధికారులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల సమయంలో సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిబంధనలపై వారికి అవగాహన కల్పించారు. ఎన్నికల సమయంలో ఎవరైన నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఎక్కడ వివాదాలు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. కొత్త ఓట్ల చేర్పులపై పలు సూచనలు చేశారు. ఎలా దరఖాస్తులు తీసుకోవాలని దరఖాస్తు దారులకు రశీదు ఎలా ఇవ్వాలి అన్న దానిపై వివరించారు. ఈ శిక్షణలో తహసీల్దార్ రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



సీసీ రోడ్ల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

యద్దనపూడి,(మార్టూరు)జూలై11 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న గ్రామాలను అభివృద్ధి చేయడం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యపడుతుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. యద్దనపూడి మండలంలోని అనంతవరం గ్రామంలో శుక్రవారం రాత్రి సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ టీడీపీ నాయకులు, గ్రామస్థులు ఏలూరిని స్వాగతించి, శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీస్సులను అందించారు. తరువాత గ్రామంలో ఎస్సీ కాలనీలో రూ.30 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఏలూరి ప్రారంభించారు. అనంతరం ఆయన గ్రామ పార్టీ నాయకులతో కలిసి వీధులలో నడుస్తూ, రోడ్డు పక్కన చిరువ్యాపారులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.పేద కుటుంబాలను బంగారు కుటుంబాలుగా చేయాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు పనిచేస్తున్నారని, రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబాన్ని అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. అంతేగాకుండా ఎస్సీ కాలనీలోని ప్రతి ఇంటికి వెళ్లి చంద్రబాబు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ, వాటికి సంబంధించిన కరపత్రాలను మహిళలకు పంచిపెట్టారు. వారి ఇళ్లలో బడికి వెళుతున్న పిల్లలు గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారందరికీ తల్లికివందనం డబ్బులు చేరాయా..? అని వారితో ఆప్యాయంగా మాట్లాడారు. అనంతవరం గ్రామంలో ప్రజల సమస్యల పరిష్కారానికి తాను కృషి చేస్తానన్నారు. గ్రామంలో తాగునీరు సక్రమంగా అందుతున్నదా..? అంతర్గత రోడ్లు, సైడుకాల్వలు తీరు ఏ విధంగా ఉందని గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యంగా ఉన్న వారికి సీఎంరిలీఫ్ ఫండ్ ద్వారా వైద్యానికి అవసరమైన సాయాన్ని అందజేస్తామన్నారు. ప్రజల ప్రభుత్వం, ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వమని రాష్ట్రాన్ని అన్నివిదాలా దివాలా తీయించిన జగన్ ప్రభుత్వ పాలనను మరచిపోయి, ప్రజలు సుఖశాంతులతో జీవనం సాగించాలన్నదే సీఎం ఆకాంక్ష అన్నారు. ప్రజలందరి సహకారంతో, రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నప్పటికీ, ప్రజలుకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. అనంతవరం గామానికి అన్ని రకాలుగా అండదండలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు నల్లపనేని రంగయ్యచౌదరి, గ్రామ నాయకులు గుదే తారకరామారావు, కొరటాల వంశీకృష్ణ, పోపూరి హనుమంతరావు, పోపూరి సాంబశివరావు, పెదవల్లి వెంకటేశ్వర్లు, మానుకొండ రామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతమైన చీరాలే లక్ష్యం : ఎమ్మెల్యే కొండయ్య



అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే

చీరాల, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : 'గత పాలకుల మాదిరిగా నియోజకవర్గంలో ఇప్పుడు కక్ష సాధింపులు లేవు, భూములు, ఇతర స్థలాలు ఆక్రమణలు లేవు, ప్రశాంతమైన చీరాలే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం' అని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమాన్ని మున్సిపల్ పరిధిలోని 7వ వార్డు శృంగార పేటలో, మండల పరిధిలోని బుర్లవారి పాలెంలో నిర్వహించారు. వార్డులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆయా ప్రాంతాలకు చెందిన ప్రజలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. దీంతో ఎమ్మెల్యే ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వర కు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు చేరడంలో ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ యువనాయకులు గౌరిఅమరనాథ్ మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, మెప్మా కొండయ్య, పెద్దఎత్తున టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ఏబీసీపై కొత్త వంతెనతో ప్రమాదాలకు చెక్

● రూ. 2 కోట్ల నిధులు మంజూరు

● మంత్రి రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న స్థానికులు



ఏబీసీపై ప్రమాదకరంగా ఉన్న వంతెన



వంతెన వెంబడి ఏర్పాటు చేస్తున్న డైవర్షన్

బల్లికురవ. జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో దశాబ్దాల క్రితం అద్దంకి బ్రాంచ్ కాలువ వల్లాపల్లి లాకుల వద్ద ఏర్పాటు చేసిన వంతెన కొన్నేళ్లుగా శిథిలావస్థకు చేరింది. ఈ కాలువలో పడి ఇప్పటికే పలువురు ప్రాణాలను కోల్పోయారు. వంతెన పరిస్థితిని చూసిన విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ టీడీపీ అధికారంలోకి రాగనే శిథిలావస్థకు చేరిన వంతెన స్థానంలో కొత్త హైలెవల్ వంతెన ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి రూ. 2 కోట్ల నిధులను మంజూరు చేయించారు. ఈ నిధులతో నూతన వంతెన నిర్మాణ పనులు ప్రారంభం అయ్యాయి. ముందుగా పాతవంతెన పక్కనే రాకపోకలకు ఇబ్బందులు లేకుండా తమూల ద్వారా డైవర్షన్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ పర్యాయం రెండు వాహనాలు ఒకేసారి వెళ్లేలాగా బ్రిడ్జిని ఏర్పాటు చేయనున్నారు. దీంతో ఎంతో కాలం నుంచి ఉన్న సమస్య పరిష్కారానికి నిధులు మంజూరు చేసిన మంత్రి రవికుమార్‌కు ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నారు. బల్లికురవ వైపు నుండి అద్దంకి వైపు నిత్యం వందలాది గ్రానైట్ ముడిరాయి లారీలు ఏబీసీ కాలువపై ఉన్న వంతెన ద్వారా రాకపోకలు సాగిస్తుంటాయని రాయి లారీలు వెళ్లే సమయంలో వంతెన కూలి పోతుందన్న ఆందోళన ప్రజల్లో ఉంది. నూతన హైలెవల్ వంతెన త్వరిత గతిన పూర్తి చేస్తే రాకపోకలకు ఇబ్బందులు ఉండదని ప్రజలు పేర్కొంటున్నారు. సాగర్ నీరు పంటలకు విడుదల అయ్యే సమయానికి వంతెన పూర్తి చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

దివ్యాంగుల ఎదుగుదలకు ప్రభుత్వ తోడ్పాటు



దివ్యాంగ బాలబాలికలకు ఉపకరణాలు అందజేస్తున్న అధికారులు

పంగులూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం దివ్యాంగులైన బాలబాలికల ఎదుగుదలకు పలు విధాలుగా తగిన తోడ్పాటును అందిస్తోందని ఎంఈవో జి.వీరాంజనేయులు అన్నారు. మండల కేంద్రమైన పంగులూరులోని భవితకేంద్రంలోని దివ్యాంగ బాలబాలికలకు ప్రభుత్వం సర్వశిక్షా అభియాన్ ద్వారా సమకూర్చిన ఉపకరణాలను శుక్రవారం స్థానిక అధికారులు, ఉపాధ్యాయులు వారికి అందజేశారు. వీల్‌ఛైర్స్, బ్యాటరీచైర్స్‌తో పాటు బాలబాలికలకు అవసరమైన పదిరకాల ఉపకరణాలు అందించనున్నట్లు స్పెషల్ ఎడ్యుకేటర్ డి.భాస్కరమూర్తి తెలిపారు. దివ్యాంగ బాలబాలికల ఎదుగుదలకు ఫిజియోథెరపీ, స్పీచ్‌థెరపీ లాంటి కార్యక్రమాలతో పాటు వారికి అవసరమైన ప్రత్యేక విద్యా కార్యక్రమాలు భవితకేంద్రం ద్వారా అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఆర్‌పీలు యోహాన్, అరుణ, హెచ్‌ఎంలు సోమేపల్లి శ్రీనివాసరావు, కంకణాల శ్రీనివాసరావు, గుర్రం లక్ష్మీప్రసాద్. బాచిన లలితకుమారి, కల్పన, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

15న డయల్ యువర్ డీఎం

అద్దంకి,జూలై11(ఆంధ్రజ్యోతి): డయల్ యువర్ డీఎం కార్యక్రమం ఈ నెల 15న 11 గంటల నుండి 12 గంటల మధ్య నిర్వహించనున్నట్లు డీఎం రామ్మోహనరావు తెలిపారు. అద్దంకి ప్రాంత ప్రయాణికులు తమ సలహాలు, సూచనలు 9959225697 నంబరుకు తెలియజేయాలన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న సేవాసమితి సభ్యులు

అద్దంకి, జూలై 11(ఆంధ్ర జ్యోతి): శింగరకొండ కాకతీయ సేవాసమితి ఆధ్వర్యంలో శుక్రవారం కష్టజీవుల సేవాసంఘం వృద్ధుల ఆశ్రమంలో అన్నదానం నిర్వహించారు. అడుసుమల్లి వెంకటేశ్వర్లు, అరుణ దంపతులు తమ కుమార్తె పద్మతేజ పుట్టినరోజు సందర్భంగా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కాకతీయ సేవాసమితి సభ్యులు సందిరెడ్డి శ్రీనివాసరావు, మలాది శ్రీనివాసరావు, చప్పిడి వీరయ్య, నరశింహరావు, నర్రా గోపాలరావు, బొడెంపూడి రామ్మోహనరావు, కమ్మ శ్రీనివాసరావు, వృద్ధాశ్రమం నిర్వహకులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అద్దంకి, జూలై11(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో కొత్తగా విద్యుత్ టవర్ లైన్ పనులు జరుగుతున్న నేపథ్యంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోందని డీఈఈ దామోదరం తెలిపారు. పట్టణంలోని సంజీవ నగర్, వియన్‌యస్ థియేటర్, ఆర్టీసీ బస్టాండ్, రామాటాకీస్ బజారు, పాత బస్టాండ్, ఎస్‌బిఐ రోడ్డు, పోలీస్ స్టేషన్ రోడ్డు, బంగ్లా రోడ్డు, కళామదిర్ సెంటర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా కు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

● చినగంజాం : మండల పరిధిలోని చినగంజాం, కొత్తపాలెం, పెదగంజాం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో వార్షిక మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు తాత్కాలికంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈఈ పి.గణనారామణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చినగంజాం, కొత్తపాలెం, పెదగంజాం సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రెవెన్యూ సమస్యలను గ్రామాలలోనే పరిష్కరించాలి



రెవెన్యూ సిబ్బందితో సమీక్షిస్తున్న తహసీల్దార్ రవినాయక్

బల్లికురవ. జూలై 11 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలోనే ప్రజల రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని, అధికారులు క్షేత్రస్థాయిలోనే పరిష్కారం చూపాలని తహసీల్దార్ రవినాయక్ కోరారు. శనివారం స్థానిక కార్యాలయంలో అన్ని గ్రామాల రెవెన్యూ సిబ్బందిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నీటివన్నులు, భూముల రీసర్వే పనులు, కౌలు రైతు కార్డులు, నివేశన స్థలాలు వంటి సమస్యలు ఎక్కడ ఉన్న వెంటనే పరిష్కరించాలన్నారు. సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ సమీక్షలో డిప్యూటీ తహసీల్దార్లు రవిబాబు, ప్రహర్ష, తదితరులు పాల్గొన్నారు.

చెరువులను సందర్శించిన ఉన్నతాధికారులు

కారంచేడు/పర్చూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : కారంచేడులో ముంచుకొస్తున్న నీటిఎద్దడిపై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. గ్రామంలోని జయప్రకాష్ నారాయణ్, లైబ్రరీ చెరువుతోపాటు, మాలచెరువును కూడా సందర్శించి నీటి నిల్వలను పరిశీలించారు. జయప్రకాష్ నారాయణ్ చెరువు పూర్తిగా అడుగంటంతో నీటి సరఫరా నిలిపివేసిన విషయాన్ని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకుపోయారు. ప్రజల అవసరాలకు సరిపడా నీటిని సరఫరా చేసే సామరథ్యం ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకు లేనందున కొన్నేళ్ల నుంచి మూడు రోజులకు ఒకసారి సరఫరా చేస్తున్నట్లు పంచాయితీ అధికారులు ఉన్నతాధికారులకు తెలిపారు. ప్రస్తుతం విడుదల చేసిన కొమ్మమూరు కాలువ నీటితో చెరువును నింపేవిధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయితీ అధికారి స్థానిక కార్యదర్శిని ఆదేశించినట్లు సమాచారం.

ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలి

● ఎంపీపీ మేకా అనంద కుమారి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

పర్చూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారంలో అధికా రులు ప్రత్యేక చొరవ చూపాలని ఎంపీపీ మేకా అనందకుమారి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంఆర్‌సీ సమావేశ మందిరంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ మండల అభివృద్ధికి అధికారులు తోడ్పాటునందించాలన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. వ్యవసాయశాఖ ఎవో భాస్కర్‌రావు మాట్లాడుతూ పొగాకు కొనుగోలు కేంద్రం ద్వారా రైతుల వద్ద ఉన్న చివరి అకువరకు కొనుగోలు చేస్తామన్నారు. త్వరలో ప్రభుత్వం అన్నదాత సుఖీభవ నగదును రైతుల ఖాతాలో జమ చేస్తుందన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ తీగలు వేలాడుతుండటంతోపాటు, స్తంభాలు వరిగి ప్రమాదంగా మారాయని ఈసందర్భంగా పలువురు సభ దృష్టికి తీసుకు వచ్చారు. సమస్యను గుర్తించామని పరిష్కారానికి కృషి చేస్తామని ఎఈ రమేష్ తెలిపారు. ఎంఈవో వెంకట్రామయ్య మాట్లాడుతూ అర్హులైన ప్రతి పిల్లవానికి అమ్మకు వందనం నగదు తల్లిదండ్రుల ఖాతాలో ప్రభుత్వం జమచేసిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రద్యూమ్నకుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు దాతల సాయం మరువలేనిది



బియ్యం పంపిణీ చేస్తున్న దాతలు, టీడీపీ నాయకులు

చినగంజాం, జూలై 11(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని దివ్యాంగులకు దాతలు అందిస్తున్న సాయం మరువలేనిదని టీడీపీ మండల అధ్యక్షులు పొద వీరయ్య, ఏపీఎం గద్దె పెదసుబ్బారావులు అన్నారు. స్థానిక వెలుగు కార్యాయంలో మండల దివ్యాంగుల సమాఖ్య అధ్యక్షురాలు విశ్రాంతమ్మ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన దివ్యాంగుల సమాఖ్య సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. మండలంలోని దివ్యాంగుల అభివృద్ధి కోసం వెలుగు సిబ్బంది చేస్తున్న కృషి అభినందనీయమని వీరయ్య అన్నారు. దివ్యాంగుల సమావేశం అనంతరం రాజుబంగారుపాలెం జడ్పీ పాఠశాల ఉపాధ్యాయులు ఆర్ఎస్‌వీ.పోతురాజు, అక్కయ్యపాలెం జడ్పీ పాఠశాల సోషల్ ఉపాధ్యాయులు గాదె శ్రీనివాసరెడ్డిలు తమ సొంత నిధులతో 25 మంది దివ్యాంగులకు పది కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో 15 మందికి వినికిడి యంత్రాలు, ఇద్దరు దివ్యాంగులకు ఎలక్ట్రికల్ ట్రైసైకిళ్లు పంపిణీ చేసినట్లు ఏపీఎం తెలిపారు. కార్యక్రమంలో చినగంజాం గ్రామ ఉపసర్పంచ్ చెరుకూరి రాఘవయ్య, మండల సమాఖ్య అధ్యక్షురాలు కావూరి శారద, టీడీపీ నాయకులు పర్వతరెడ్డి పార్థసారిధి, చినగంజాం గ్రంథపాలకులు ఎ.మోహనలక్ష్మీనరసింహాచార్యులు, మండల దివ్యాంగుల సమాఖ్య కార్యదర్శి వడ్లమూడి వేణు, సభ్యులు కే.సురేష్‌బాబు, చిట్టిబాబు, సీసీలు రంగస్వామి, శ్రీలక్ష్మి, మాధవి, మండల పరిధిలోని దివ్యాంగులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి సమప్రాధాన్యం



16వ వార్డులో కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

అద్దంకి, జూలై11 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం ఇస్తూ కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని మాజీ ఎంపీపీ మన్నెం ఏడుకొండలు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని శుక్రవారం అద్దంకి పట్టణంలోని 16 వ వార్డులో స్థానిక టీడీపీ నేతలు నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్య క్రమంలో టీడీపీ నేతలు య ర్రాకుల రామాంజనేయులు, కోటిలింగాచారి, అద్దంకి నరేష్, భైరపునేని మోహనరావు, కామినేని శీనావలి, మహలక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.